# మిసిమి

మాస పత్రిక

జులై 2008



రూ. 8/-



రాత్రి కాపలాదారు (అజ్ఞాతచిత్రకారుడు)
ఇంగ్లాండ్.



గంటల గడియారం (సంగీత గడియారం), ఇంగ్లాండ్, (19వ శతాబ్ది)

# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.**

సంపుటి 19 | జులై 2008 | సంచిక 7

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**

## విషయ సూచిక

| | |
|---|---|
| సంశయమే ఉన్మాదం - ఉన్మాదమే కళ! | మూలం : నిర్మల్ వర్మ<br>అనువాదం : డా॥ జె. లక్ష్మిరెడ్డి |
| కళల ఖజానా సాలార్‌జంగ్ మ్యూజియం | కాంౡగుల నాగేశ్వరరావు |
| తెలంగాణా వచన కవిత - వృత్తుల చిత్రణ | ఎండ్లూరి సుధాకర్ |
| సాగరాలు - జరుగుతున్న పరిశోధనలు | సి.వి. సర్వేశ్వర శర్మ |
| తెలుగులో నూతన పద నిర్మాణం : ఆవశ్యకత-పద్ధతులు | డా॥ రేమిల్లి వేంకట రామకృష్ణశాస్త్రి<br>డా॥ అద్దంకి శ్రీనివాస్ |
| ఆంధ్రుల చరిత్రలో తొలిదశ | వకుళాభరణం రామకృష్ణ |
| విశ్వనాథ - సౌందర్య జిజ్ఞాస | డా॥ యు.ఎ. నరసింహమూర్తి |

విడిప్రతి రూ. **8/-** వార్షిక చందా రూ. **100/-** విదేశీయులకు **$ 20**

ముఖచిత్రం : రెబెకా

*శిల్పి : జి.బి.బెంజిన్* **(1876 A.D.)**

Printed & Published by **Bapanna Alapati,** at Kala Jyothi Process Pvt. Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 20. Ph. 27645536
E-mail : misimi@kalajyothi.com

*సంపాదకుడు :* **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# The Decline of Buddhism In India

**– D.D. Kosambi**

"Buddhism owed its initial success precisely to its fulfillment of a great social need. The major civilizing function of Buddhism had ended by the seventh century A.D. The ahimsa doctrine was universally admitted, if not practiced. Vedic sacrifices had been abandoned except by some rare princeling whose revivalist attempt had little effect upon the general economy. The new problem was to induce docility in the village cultivators, with out an excessive use of force. This was done by religion, but not by Buddhism. The class structure in the villages appeared as caste, always scorned by the Buddhists. Primitive tribesmen were enrolled as new castes. Both tribesmen and peasents relied heavily upon ritual, which the Buddhist monk was forbidden to practice; ritual remained a monopoly of the Brahmin.

"Moreover, the Brahmin at that time was a pioneer who could stimulate production, for he had a good working calendar for predicting the times of ploughing, sowing, harvest. He knew something of new crops, and trade possibilities. He was not a drain on production as he had his sacrificing ancestors, or the large Buddhist monasteries. A compromise could also be effected by making the Buddha an avatatra of Vishnu. So formal Buddhism inevitably faded away.

"It's main lesson need never be lost : that good thoughts require cultivation and training of the mind by the individual's personal efforts, no less carefully than good singing that of the voice or craftsmanship that of the hand. The value of the thoughts, on the other hand, is to be judged by the social advance which they encourage".

*Sent By* T. Ravi Chand



నిర్మల్ వర్మ
(1929-2007)

# సంశయమే ఉన్మాదం - ఉన్మాదమే కళ!



*1999వ సం॥ జ్ఞానపీఠ్ పురస్కార స్వీకారోపన్యాసంలోని ముఖ్యాంశాలు (హిందీ నుంచి అనువాదం)*

అనువాదం : డా॥ జె. లక్ష్మిరెడ్డి

ఈ రోజు మొట్టమొదట భారతీయ జ్ఞానపీఠానికి కృతజ్ఞత తెలుపుతూ, నా తెలిసీ - తెలియని వయసులో మొదటిసారిగా పద-ప్రపంచంతో నాకు పరిచయం కలిగించిన వారినందరినీ స్మరించుకుంటున్నాను. వాళ్ళు నా అంతస్సులోని మాయామయ సృష్టిని నా ఎదుట సాక్షాత్కరింప చేసినందు వల్లనే కోరుకున్నప్పుడల్లా నేను నా ఏకాంతం నుండి బయటపడి అక్కడి వినూత్న ప్రపంచంలో ప్రవేశించ గలిగేవాణ్ణి. ఆ ప్రపంచంలో అన్ని వస్తువులు, ప్రాణులు, సమస్త జీవ జగత్తు తన పరాయితనం విడిచిపెట్టి చెంతకు చేరి వస్తూ ఉంటుంది. అలాంటి స్థితిలో మనం ఒకే కాలంలో అనేక ప్రపంచాల్లో, అనేక కాలఖండాల్లో జీవించడం ఆరంభిస్తాం. అప్పుడు మన లోపల ఏదైతే జరుగుతుందో, అది బయట కూడా సాక్షాత్కరిస్తుందని మొదటిసారిగా మనకు తెలిసివస్తుంది. బయటి, లోపలి హద్దులు హఠాత్తుగా కూలిపోయి, తమ-తమ పరిధుల నుండి విడుదలై అన్నీ ఒకదానిలోకి మరొకటి ప్రవహిస్తున్నట్లనిపిస్తుంది. ఈ ప్రభ తన బాధాకరమైన ఉజ్జ్వలతతో సాహిత్యంలో వెలువడడం నేను చూశాను. ఏదో కవితగానీ, నవలగానీ చదువుతున్నప్పుడు నేను స్వయంగా ఈ ప్రభ అంశం అయిపోయేవాడిననీ, అలా జరిగి ఒకసారి సాహిత్య సత్యం యొక్క స్పర్శ పొందిన తర్వాత మనిషి వేరే ఏ సత్యానికీ పనికిరాకుండా పోతాడనే భావన నాకు కలిగేదనీ, అనడం బహుశా మరింత సబబుగా ఉంటుందేమో. ఈ సత్యం సాహిత్యంలో తప్పించి మరెక్కడా మనకు లభించదు. దీన్ని మీరు ఒక పొడుపు కథగా భావించక పోతే సాహిత్య-సత్యం జన్మించగానే అనేకంగా విభక్తమయ్యే కొన్ని విచిత్ర జీవుల లాంటిది, అని అంటాను. ఒకే గొడుగు కింద ఏదో ఒక మతానికి సంబంధించిన దురాగ్రహం గానీ, లేక రాజకీయ నియంతృత్వం గానీ పుష్పించి-ఫలించ వచ్చుగాక, సాహిత్య-సత్యం మాత్రం వాడిపోతుంది. సాహిత్య మర్మం అనేక సత్యాల సహస్రధారలో తన పవిత్ర ప్రాణతత్వాన్ని గ్రహిస్తుంది. రాజనీతి, తత్వశాస్త్రం లేదా ధర్మశాస్త్రాల్లో అయితే మనం ఒకచోట ఆగి, ఇదే సంపూర్ణ సత్యం, ఆవల ఏమీ లేదు, అని అనడానికి వీలుంది.

కానీ సాహిత్యం మాత్రం ఒక కల్లోలినీ నది లాగా కొండల-గుట్టల మధ్య, చెట్ల, పొదల మధ్య నిరంతరం ముందుకు సాగిపోతూ ఉంటుంది. జీవితం యొక్క అర్ధ సత్యాల మధ్య సంపూర్ణ సత్యాన్ని పొందే అదమ్య పిపాస నుండి ఏ కవిత గానీ, కథ గానీ, నవల గానీ, జన్మిస్తుందో,

---

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి, బి-1/93, జనక్‌పురి, న్యూఢిల్లీ-110 058

దానితోనే మనం మన దప్పిక తీర్చుకోగలుగుతూ ఉండడం ఎంత ఆశ్చర్యకరం? ఈ దృష్టితో చూసినప్పుడు సాహిత్యానికి, ఇతర అధ్యయనాంశాల (disciplines) కు చాలా తేడా ఉంది. ఇక్కడ ఏ తిన్నని దారీ, నిర్దిష్ట సత్యం వైపు తీసుకెళ్ళదు. ఇక్కడ మన మనసులోని చీకటి దారుల్లోనే తడుముకుంటూ వెళ్ళవలసి ఉంటుంది. ఇక్కడ కాళ్ళు తడబడితే మిమ్మలను ఆదుకునే ఆదరువు ఏదీ ఉండదు. ఆదరవు వెదకాలనిపిస్తే మనం సాహిత్యాన్నాశ్రయించకూడదు. అక్కడ సందేహం మరింత ప్రగాఢంగానూ, అంధకారం మరింత అంధకారమయంగానూ, తృష్ణ మరింత తృష్ణా పూరితంగానూ ఉంటుంది. కేవలం అస్తిత్వపు చరమ హద్దు దాకా చేరినప్పుడే మనం సాహిత్యంలో మన సత్యాన్ని పొందగలం. ప్రాపంచిక సౌకర్యాల్లో లీనమై ఉండే మనం అక్కడికి వెళ్ళడంలో ఉండే ప్రమాదంలో పడడానికి ఇష్ట పడం కాబట్టి సాహిత్యం మనకోసం ఈ ప్రమాదాన్ని స్వీకరిస్తుంది. అందువల్ల సాహిత్యానికి మనమేదో ఇస్తున్నామని గర్వపడకూడదు. మనం రాసేదంతా కూడా ఒక రకంగా హోమరు, వ్యాసుడు, షేక్స్పియర్, తులసీదాసు, దాస్తోవస్కీ, తోలస్తోయ్ లాంటి రచయితల నుండి మనం పొందిన రుణం తీర్చుకునేందుకు చేసే వినమ్ర ప్రయత్నమే. వాళ్ళు మనకోసం ఏ ప్రపంచాలు సృష్టించారో ఆ ప్రపంచాలు గనక లేకుండా ఉండి ఉంటే మన ఈ ప్రపంచం ఎలాంటి అంతులేని ఎడారిగా తయారయి ఉండేదో, మనం ఊహించగలమా?

ఈ రోజు, ఈ తరుణంలో నేను సాహిత్యం పట్ల నా కృతజ్ఞత తెలుపుకునేందుకు నిలబడ్డానంటే కారణం, అది జీవితపు ఎడారిని కొంత వరకు సహించడానికి వీలైందిగా చేసిందనే కాదు. అది ఈ శతాబ్దిలోని మనిషిని ఇంత గాయపడినవాడుగా, ఇంత దిగ్భ్రమ చెందిన వాడుగా చేసిన మరీచికల సమ్మోహనాన్ని పటాపంచలు చేసే గొప్ప సాహసం చేసిందని కూడా. రచయితలు, కవులు తాము రాసిన పదం కారణంగా తమ నివాసాల నుండి నిర్వాసితులై విదేశీ ఆకాశం క్రింద శరణు వెదక వలసిన సమయం బహుశా మునుపు ఎప్పుడూ ఇంతగా రాలేదేమో!

నాకొక దృశ్యం ఎప్పుడూ గుర్తుకు వస్తూ ఉంటుంది. రష్యన్ కవి బ్రాడ్స్కీకి కిటికీ బయట మోడు వారిన చెట్టుపైన చలికి వణికిపోతున్న రెండు పక్షులను చూసినప్పుడంతా దేశ బహిష్కృతుడైన తమ పుత్రున్ని చూడడానికి తాము జీవించివున్నప్పుడు రాలేకపోయినా, చనిపోయిన తర్వాత పక్షుల రూపంలోనైనా తన తల్లిదండ్రులు వచ్చారేమో అని ఆయనకు అనిపించేదట! ఇంతేకాదు, రచయిత తన పదాల ద్వారా సృష్టించుకున్న వైకల్పిక ప్రపంచంలో, నిరాశచెందిన ప్రతి వ్యక్తి, ప్రపంచంలోని ఏ మూల నుంచైనా, ఏ జాతి గానీ దేశం గానీ ఇచ్చిన పాసుపోర్టు చూపించనవసరం లేకుండా వచ్చి ఆశ్రయం పొందగలుగుతాడు. ఏ వృక్షం వ్రేళ్ళు ఆకాశంలో వ్యాపించినా దాని కొమ్మల కింద భూమి అంతా తన శోభాస్థలిని నిర్మించుకుంటుందో, అలాంటి పురాణ (mythical) వృక్షం లాంటిది సాహిత్యం. ఈ రూపకాన్ని మరింత ముందుకు తీసుకుపోతే, ఈ వృక్షపు ప్రతి కొమ్మ ప్రపంచంలోని ప్రతి సంస్కృతికి తన స్మృతుల, సంస్కారాల గూడు నిర్మించుకునేందుకు ఆధారం కల్పించే ఒక భాష కాదా? మనిషి శరణస్థలి సాహిత్యమైనప్పుడు దేనిలో అయితే ప్రతి సంస్కృతి యొక్క బింబాలు, ప్రతీకలు, స్వప్నాలు, ఆకాంక్షలు రూపదిద్దుకుంటాయో ఆ భాష ప్రకృతి శరణస్థలి అవుతుంది. మనం ఏ భాషలో రాస్తామో, ఆలోచిస్తామో, అందులో మన వ్యక్తిగత భావాలను,

భావనలను మాత్రమే వ్యక్తం చేయం. తద్వారా మొత్తం ఒక జాతి యొక్క, సమాజం యొక్క విశిష్ట రూపం తన ప్రత్యేకమైన రంగులోను, రూపంలోను ప్రకాశిస్తుంది.

మనం హిందీ రచయితలం ఎంత ఆధునిక చైతన్యం కలవారమైనా సరే, రాసేప్పుడు మన పదాల్లో ప్రజా భాషల్లోని జానపద రాగాల ప్రతిధ్వనిని మాత్రమే కాదు, వేల సంవత్సరాల మునుపటి సంస్కృత వాఙ్మయ సంస్కారాల ప్రతిధ్వనిని కూడా వినగలుగుతాం. రచయిత ఎంత స్వేచ్ఛ కలవాడైనా రాసేప్పుడు పదాల అధీనంలో ఉంటాడు. ఒక హద్దు తర్వాత భాషే స్వయంగా మన ఆలోచనల, అనుభూతుల దిశను నియంత్రించడం ఆరంభిస్తుంది. అది మనకు అనుభవ పూర్వకంగానే తెలుసు. ఎవరి మానసికతపైన ఎన్నో ఏండ్లుగా విదేశీ భాష రాజ్యమేలిందో, అంతేకాక దుర్భాగ్యవశాత్తూ స్వాతంత్ర్యం వచ్చిన యాభై ఏండ్ల తర్వాత ఇప్పుడు కూడా ఆ స్థితే కొనసాగుతూ ఉందో, అలాంటి భారతీయులమైన మనకు కాక మరెవరికి ఈ విషయం బాగా తెలుస్తుంది? భారతీయ జ్ఞానపీఠం ఏ భేదభావమూ లేకుండా అన్ని భారతీయ భాషల ఉత్కృష్ట రచనలను ఆదరిస్తుంది. ఇది నాకు అదనంగా సంతోషం కలిగించే విషయం. మనలోని ప్రతి రచయిత తన భాషలోరాస్తాడు. అయినా అతడు సునాయాసంగానే భారతీయ భాషల ఒక బృహత్ సముదాయంలో సభ్యుడైపోతాడు. 'సముదాయం' అనే పదాన్ని ప్రయోగించినప్పుడు నేను కేవలం భౌగోళిక దృష్టితోనే కాదు, ఎంతో లోతైన సాంస్కృతిక అర్థంలో కూడా ప్రయోగిస్తున్నాను. అంటే ఏ అర్థంలో అయితే ప్రతి భారతీయ భాష ఇతర భాషలతో వేరైనప్పటికీ ఒకే చారిత్రక స్రోతస్సు నుండి తన సాంస్కృతిక సందర్భాన్నీ, స్మృతి సంకేతాలను గ్రహిస్తుందో, ఏ అర్థంలో వాటి అంతర్లీనమైన ఏకత్వం నెలకొని ఉంటుందో, ఆ అర్థంలో కూడా ప్రయోగిస్తాను.

ఈ దృష్టితో చూసినప్పుడు భారతీయ సాహిత్యం ప్రపంచంలో బహుశా విలక్షణమైందేమో. ఎందుకంటే ఇక్కడ ప్రతి రచయిత ఒకే సమయంలో అనేక కాలావధుల్లో, అనేక అనుభవ స్థాయిల్లో జీవించవలసి ఉంటుంది. తన రచనను సార్వదేశీయంగా చేయడానికి అతడు బయటికెక్కడికో వెళ్ళవలసిన అవసరం ఉండదు. ఎందుచేతనంటే ప్రతి బయటి అనుభవం అతని మనీషలో ఎక్కడో ఒక చోట విచరిస్తూ ఉంటుంది. వెనుతిరిగి తన భూతకాలంలోకి వెళ్ళవలసిన అవసరం ఉందని కూడా అతనికి అనిపించదు. ఎందుచేతనంటే అతని భూతకాలం ఏదో మ్యూజియంలో పదిలంగా ఉంచబడిన వస్తువులా కాకుండా అతడు జరుపుకునే అనేక పండుగల్లో, అనుష్ఠానాల్లో ప్రవహిస్తూ ఉంటుంది కనుక.

రెండువందల సంవత్సరాల వలస పరిపాలన దేశ మానసికతపైన ఏ ఏ గాట్లు చేసిందో, వాటి కారణంగా ఆ మానసికతకు తన సాంస్కృతిక అస్మితను మాటి-మాటికి కొత్తగా పునర్నిర్వచించుకోవలసి వచ్చింది. ఈ ఉద్యమంలో అది ప్రేమచంద్, నిరాలా, రవీంద్రనాథ్ ఠాగూరు, సుబ్రహ్మణ్య భారతి లాంటి రచయితల నుండి ప్రేరణ పొందడమే కాక పాశ్చాత్య సభ్యత ప్రభావాన్ని ఎదుర్కోవడంలో వివేకానందుడు, అరవిందుడు, గాంధీజీ లాంటి వ్యక్తుల ఆధ్యాత్మిక వారసత్వానికి కూడా గుర్తింపునిచ్చింది.

ఏ సాహిత్య రచన అయినా భారతీయ భాషలో రాసినంత మాత్రాన్నే ఉత్కృష్టమైపోదు. కానీ, ప్రతి ఉత్కృష్ట రచన వెనుక ఈ శ్రేష్ఠ వ్యక్తులు మనకందించిన, నిరంతరంగా సాగి వచ్చిన ఒక సంప్రదాయానికి చెందిన భావభూమి మాత్రం ఉంటుంది. అందువల్ల ఈ రోజు వారిని స్మరించుకోవడం ఇంత అవసరమని నాకు తోస్తూంది. నిజం చెప్పాలంటే ఈ పురస్కారం నాకొచ్చింది కాదు, అనేక ఆత్మసంశయాల, అనుమానాల పొగమంచులో ఉంటూ ఏ పుస్తకాలు నేను రాశానో, ఆ పుస్తకాలకు వచ్చింది. ఎక్కడ ఎంత సత్యం నాకు కనిపిస్తూ ఉండేదో అక్కడ అంతకంటే ఎక్కువ సత్యం మరుగున దాగి ఉండేది. అందువల్ల ఒక రచయిత స్థితిలోని వైపరీత్యాన్ని ఎంతో మార్మికంగా వ్యక్తం చేసిన మరో దేశ రచయిత చెప్పిన మాటలతో నా ప్రసంగం ముగిస్తాను:

"మనం చీకట్లో పని చేస్తూ ఉంటాం. మనం ఏది చేయగలమో, అదే చేస్తాం. మన దగ్గర ఏదైతే ఉందో, అది ఇచ్చేస్తాం. మన సంశయమే మన ఉన్మాదం. మన ఉన్మాదమే మన కళ. మిగిలిందంతా కళ యొక్క పిచ్చితనమే".

కళను పిచ్చితనం అని చెప్పిన హెన్రీ జేమ్స్ చెప్పిన మాటలివి. దీనికి నేను కేవలం ఒక మాట చేర్చదలచుకున్నాను. ఎవరైనా తన పిచ్చితనానికి పురస్కారం పొందితే, అంతకు మించిన పిచ్చితనం మరేముంటుంది?

## జీవిత విశేషాలు, సాహిత్య పరిచయం:

20వ శతాబ్దపు హిందీ సాహిత్యానికి రూపునిచ్చిన గొప్ప రచయితల్లో నిర్మల్ వర్మ ఒకరు, అని నిస్సందేహంగా చెప్పవచ్చు. 1950వ దశకంలో ఆయన కథలు హిందీలో 'నఈ కహానీ' (కొత్త కథ) ఉద్యమానికి శ్రీకారం చుట్టాయి. ఆయన మొదటి కథా సంపుటి 'పరిందే' (పక్షులు) 1958లో వెలువడింది. అది వెలువడడంతో పాటు ఒక అసాధారణ ప్రతిభావంతుడు, సంవేదనాపరుడు అయిన రచయితగా ఆయన గుర్తింపు పొందారు. తర్వాత వెలువడిన కథా సంపుటాల్లో కూడా ఆయన మన యుగానికి చెందిన మనిషిలోని ఆత్మ సంఘర్షణను, నైతిక బాధ్యతలను, సంస్కృతిని ఎంతో సంవేదనాత్మకతతో లోతుగా విశ్లేషించారు. మనో జగత్తులో విహరించడం, అంతరంగంలో దాగిన విషయాలను వెదకడం ఆయనకు చాలా ఇష్టం. ఆయన నవలలు, విచారోత్తేజకాలైన వ్యాసాలు కూడా విశిష్టమైనవే. రచయితగా, చింతనుడుగా, విద్వత్తుగల వ్యక్తిగా నిర్మల్ వర్మకు హిందీ సాహిత్యంలో గొప్ప స్థానం ఉంది.

నిర్మల్ వర్మను కేవలం హిందీలోనే కాక 20వ శతాబ్దంలోని గౌరవాస్పదులైన భారతీయ రచయితల్లోనే ఒకరుగా పరిగణించాలి. ఆ శతాబ్దంలో కేంద్ర స్థానంలో ఉండిన పాశ్చాత్య ప్రభావాన్ని ఎదుర్కోవలసిన అవసరానికి, అప్పటి ఆధ్యాత్మిక స్థితికి, ఆలోచనా ధోరణులకు, వ్యక్తి ఆత్మ చైతన్యానికి, సామాజిక వత్తిళ్ళకు సంబంధించిన ప్రశ్నలన్నింటినీ నిర్మల్ వర్మ నిశితత్వంతోనూ, సాహసంతోనూ తన సృజనాత్మక రచనల్లో, విమర్శాత్మక రచనల్లో విశ్లేషించారు, స్పష్టపరచారు.

నిర్మల్ వర్మ భాష పరిష్కృతిలో, సూక్ష్మతలో, సంవేదనాశీలతలో దాదాపు ఒక ప్రమాణంగా నిలిచింది. 20వ శతాబ్దంలోని భారతీయ సభ్యత ఆధునిక పాశ్చాత్య ప్రభావానికి ఎక్కువగా లోబడి

ఉంటూ వచ్చింది. మన అదృష్టం కొద్దీ ఆ రోజుల్లో భారతీయ సభ్యత ఎదుర్కొన్న ఆంతరిక విపత్తులను గురించి, అది పాశ్చాత్య ప్రభావాన్ని ఎదుర్కొన్న రీతిని గురించి, భారతీయ ఆధునికతా వికాసాన్ని గురించి, లోతుగాను, నిర్ద్వంద్వంగాను ఆలోచించిన జాగరూకులైన, ప్రతిభావంతులైన సాహిత్యకారులు మనకు ఉండినారు. ఈ దిశగా నిర్మల్ వర్మ కృషి చాలా విలువైంది, విచారోత్తేజకమైంది. ఆయన 20వ శతాబ్దం రెండో భాగంలో భారత దేశంలోని ఒక ప్రధాన నాగరికతా విమర్శకుడుగా మన ముందు నిలిచారని అనడం చాలా సబబుగా ఉంటుంది. ఆయన హిందీ కథలో, నవలలో కొత్త భావుకతను తీసుకొచ్చే ప్రశంసనీయమైన పనిచేశారు. మన భావాలను, అనుభూతులను సంవేదనలను, ఆలోచనలను వ్యక్తీకరించేందుకు ఒక సరికొత్త భాష కూడా ఆయన ఇచ్చారు. దేనికీ భయపడకుండా నిర్మల్ వర్మ నిరంతరం ఆధునిక భారతీయ సభ్యత ఎదుర్కొంటున్న విపత్తులను వివరించి తన బౌద్ధిక ప్రశ్నాకుశలతను, ఆధ్యాత్మిక అశాంతిని, సృజనాత్మక వ్యాకులతను నిరూపించుకున్నారు. రచననే జీవితాంతం తన ముఖ్య జీవనాధారంగా చేసుకొన్న నిర్మల్ వర్మ హిందీలో రచయిత స్వాభిమానానికి, స్వేచ్ఛకు, బాధ్యతకు, ఒక కొలమానంగా నిలిచారు. వైచారికమైన గద్యమే కాక, ఆయన యాత్రా వృత్తాంతాలు, విమర్శ, డైరీలు మొదలైన అనేక గద్య ప్రక్రియల్లో కూడా తనను, తన కాలాన్ని, గొప్ప సమర్థతతో వ్యక్తీకరించారు. వర్తమానంలోని సమస్త అంతర్ద్వంద్వాలను, అంతర్విరోధాలను అర్థం చేసుకోడానికి నిర్మల్ వర్మ లాంటి రచయిత సాహిత్యం ఎంతగానో ఉపకరిస్తుంది.

నిర్మల్ వర్మ 1929 ఏప్రిల్ 3న సిమ్లాలో పుట్టారు. రమణీయమైన పర్వత ప్రాంతంలో ఆయన బాల్యం గడిచింది. అక్కడే మాధ్యమిక స్థాయి వరకు చదువుకున్నారు. తర్వాత ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని సెంట్ స్టీఫెన్స్ కాలేజీలో ఎమ్.ఎ. (చరిత్ర) చదివారు. అటు పిమ్మట కొంతకాలం ఉపాధ్యాయుడుగా పనిచేశారు. జెకొస్లోవాకియా విద్యా సంస్థాన్, జెకొస్లోవాకియా రచయితల సంఘం ఆహ్వానం పైన ప్రాగ్ వెళ్ళి (1969) అక్కడ ఏడు సంవత్సరాలుండి శ్రేష్ఠ జెక్ కథా సాహిత్యాన్ని హిందీలోకి అనువదించారు. మరో జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత, హిందీ రచయిత సచ్చిదానంద హీరానంద్ అజ్ఞేయ్ లాగానే భారత దేశంలో విదేశీయుడుగానూ, విదేశాల్లో భారతీయుడుగానూ చెప్పబడే నిర్మల్ వర్మ విదేశీ సాహిత్యం బాగా చదివి అందులో కూడా మంచి కృషి చేశారు. జెకొస్లోవాకియా వాసుల జీవన పరిస్థితుల ఆధారంగా హిందీలో కథలు రాశారు. ఆ తర్వాత లండన్ వెళ్ళారు. చాలా ఏండ్లు యూరప్‌లో గడిపారు. అక్కడి నుండి టైమ్స్ ఆఫ్ ఇండియాకు అనేక విషయాల గురించి వ్యాసాలు, రిపోర్టులు రాసి పంపారు. కొంతకాలం సిమ్లాలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్‌లో ఫెలోగా ఉన్నారు. ఇంటర్నేషనల్ రైటింగ్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయోవా వెళ్ళారు. భోపాల్‌లోని నిరాలా సృజనకు, సిమ్లాలోని యశ్‌పాల్ సృజన పీఠానికి, అధ్యక్షులుగా ఉన్నారు. వీరు హిందీ కథలో నవలలో కొత్త భావుకతను తీసుకువచ్చే ప్రశంసనీయమైన పనిచేశారు.

నిర్మల్ వర్మ 5 నవలలు, 6 కథాసంపుటాలు, 1 నాటకం, 3 యాత్రావృత్తాంతాలు, 8 వ్యాససంపుటాలు, 4 సంకలిత రచనలు వెలువరించారు.

నిర్మల్ వర్మ అనేక పురస్కారాలు, సన్మానాలు పొందారు. వాటిలో 'కవ్వే ఔర్ కాలా పానీ' (కథా సంపుటి) కి సాహిత్య అకాడెమీ పురస్కారం, 'భారత్ ఔర్ యూరప్ : ప్రకృతి కా క్షేత్ర్' (ఆలోచనాత్మక గ్రంథం) కు జ్ఞానపీఠ్ సంస్థ వారి మూర్తిదేవి పురస్కారం, 1978-98 మధ్యకాలంలో భారతీయ సాహిత్యాన్ని సుసంపన్నం చేయడంలో ఉత్కృష్టమైన సేవలందించినందుకుగాను పంజాబీ రచయిత గురుదయాల్ సింహ్‌తో కలిపి ఉమ్మడిగా ప్రదానం చేయబడిన 35వ జ్ఞానపీఠ పురస్కారం ఉన్నాయి.

నిర్మల్ వర్మతో శైలేంద్ర కుమార్ త్రిపాఠీ, గరిమా శ్రీవాస్తవ, జగదీశ్ భగత్ జరిపిన ముఖాముఖిలోని ముఖ్యాంశాలు——

**ప్ర : చాలా వరకు మీ కథల్లోని, నవలల్లోని Theme 'ఒంటరితనమే'. ఈ ఒంటరితనమే ఎందుకు? ఒంటరితనం మీకు ఇష్టమని ఒక సందర్భంలో మీరన్నారు. మీ పాత్రల్లో ఈ ఒంటరితనమే ప్రతిబింబిస్తుందా?**

జ : పాత్రల్లో ఒంటరితనం వేర్వేరు కథల్లో వేర్వేరుగా ఉంటుంది. ఈ పాత్రల ఒంటరితనానికి సంబంధించి ఏదైనా ఒక సర్వసామాన్యమైన అభిప్రాయం ఏర్పరుచుకోడానికి వీల్లేదు. పాత్రల ఒంటరితనం రచయిత అంతరంగ జీవితంతో సంబంధం లేకుండా ఉండదు. ఒక హద్దు వరకు రచయిత ఈ పాత్రలో జీవిస్తాడు కూడా. కానీ, ఆ తర్వాత పాత్రలు తమ దిశను తామే వెతుక్కుంటాయి. వాటి Compulsions వాటిని ముందుకు నెట్టుకుంటూ వెళ్ళిపోతాయి. రచయిత ఒక వ్యక్తి మాత్రమే. కానీ పాత్రలు అనేకం. ప్రతి పాత్ర తన జీవితం జీవిస్తుంది. రచయిత తన కల్పనా శక్తితో పాత్రల అంతస్థలాన్ని ఛేదించి వాటిని మన ఎదుట నిలపడంలో సఫలత సాధిస్తాడు. అందువల్ల అజ్ఞేయ్ (1978వ సంవత్సర జ్ఞానపీఠ పురస్కారం పొందిన ప్రసిద్ధ హిందీ రచయిత) ను గొప్ప కథాకారునిగా నేను భావించను. ఎందుకంటే ఆయన ఆత్మలీనుడై ఉండేవాడు. ఆత్మలీనుడుగా ఉండే వ్యక్తి కవి కాగలడు గానీ, కథాకారుడు కాలేడు.

ఒంటరితనం అనేక విధాలుగా ఉంటుంది. దాని వేర్వేరు రూపాలను గుర్తించడం అవసరం. ఒక రకంగా ప్రతివ్యక్తీ ఒంటరివాడే. మీ దినచర్యనే తీసుకోండి, ఎక్కువ సమయం మీరు ఒంటరిగానే ఉంటారు. నేను ఒంటరి తనాన్నే Theme గా చేసుకొని కథలు రాస్తాననడం సరికాదు. నేను సాధారణ మానవుని కథలు రాస్తున్నాను. 'ఎలీట్' క్లాసు కథలు కాదు.

**ప్ర : మీకొన్ని పాత్రలు ప్రయత్న పూర్వకంగా ఒంటరితనంలోనే జీవిస్తాయి. కారణం?**

జ : అలా ఏమీలేదు. స్మృతి శకలాలు తీసుకురావడం నా శైలిలో ఒక భాగం. ఇది విషయాలను చూసే నా దృష్టి. దానితోనే నేను నాకు, ప్రపంచానికి మధ్య సంబంధం ఏర్పరుచుకుంటూ వెళ్తాను.

ఇక ఒంటరితనాన్ని గురించి చెప్పాలంటే, 'ఒక రోజు అతిథి' అనే కథలో ఒంటరిగా వీగి పోవడం అందులోని పురుష పాత్రకున్న వివశత. కథలో అతని భార్య కూడా అతనికి దూరంగా ఉండాలనుకోదు. అయినా ఆ వ్యక్తి ఉంటున్న కుంటుంబ పరిస్థితుల్లో అదే అతని వివశత. అక్కడ వేరే మార్గంలేదు.

రచయిత వికల్ప రాహిత్యాన్ని చిత్రించినప్పుడు కళ యొక్క చరమ సత్యం కూడా వెలుగులోకి వస్తుంది. నా కథల్లో ఒంటరితనంతో పోరాడుతున్న, దాన్నుండి విముక్తి పొందడానికి ప్రయత్నిస్తున్న పాత్రలున్నాయి. కేవలం ఒంటరితనాన్ని చిత్రించడం నా కథల ఉద్దేశ్యం కాదు.

**ప్ర : హిందీలో ఇప్పటి 'విమర్శ' గురించి మీ అభిప్రాయం ఏమిటి?**

జ : విమర్శాత్మక వ్యాసాలు చదవడం నాకు అన్నింటికంటే ఇష్టం. కవిత్వం, నవలతో సమానంగానే విమర్శలో రసాస్వాదన కలుగుతుంది. విమర్శ బౌద్ధిక రసాస్వాదన. మంచి విమర్శ ఆనందాన్నిస్తుంది. కానీ హిందీలో మంచి విమర్శలేదు. కవిత్వం, నవల రాసే విషయంలో జరుగుతున్న కృషితో పోల్చిచూస్తే విమర్శ విషయంలో జరుగుతున్న కృషి చాలా తక్కువ.

**ప్ర : మీ జీవితాన్ని గురించి ఇంతవరకు రాయలేదు. రాసే ఉద్దేశ్యం ఉందా?**

జ : నిజానికి నా కథల్లో నేను ఎంత ఎక్కువగా కలిసిపోయానంటే జీవితానుభవాల గురించి వేరుగా రాయవలసిన అవసరం ఉన్నట్లు అనిపించలేదు. మన జీవితంలోని అనేక విషయాలు పరోక్షంగా కథల్లో వచ్చేస్తాయి. అప్పుడు వాటిని గురించి యథాతథంగా రాయడం పట్ల ఆకర్షణ ఉండదు.

**ప్ర : మీరు విదేశీ సాహిత్యం కూడా అధ్యయనం చేశారు కదా? మీకు నచ్చిన రచయితలెవరు?**

జ : చాలా చదివాను. వర్జీనియా వుల్ఫ్, చెఖవ్, తోలస్తోయ్, దాస్తోయవస్కీ, వీరంటే ఇష్టం.

**ప్ర : 'చర్చ మధ్యలో' అనే కథలో మీ పాత్రలు చెప్పదలచుకున్న మాటను స్పష్టంగా చెప్పలేక పోతున్నాయని అనిపిస్తుంది. దీనివల్ల అప్పుడప్పుడు పాఠకునికి ఇబ్బంది కలుగుతుంది.**

జ : ఈ కథలో చావుకు చేరువలో ఉన్న తండ్రి ఉన్నాడు. అతనికి పరిచర్యలు చేస్తున్న కొడుకు ఉన్నాడు. తండ్రి పైన కొడుక్కు సారిసారికీ కోపం వస్తుంది. అయితే తండ్రి పైన కోప్పడేంత క్రూరత్వం అతడు చూపలేడు. మానవుని మనసు ఇలాగే ఉంటుంది. ఎప్పుడు ఏది చెప్పాలనుకుంటామో, అది చెప్పలేం. మనసులో ఒకటి, అభివ్యక్తిలో మరోటి. కళ ఇదే. మాటల్లో చెప్పక పోయినా అది ప్రతిధ్వనిస్తుంది.

**ప్ర : ఇప్పుడు రాస్తున్నవాళ్ళలో మీకు ఎవరు నచ్చుతారు?**

జ : వినోద్‌కుమార్ శుక్ల, సురేంద్ర వర్మ, కృష్ణా సోబ్తీ రాసిన నవలలు బాగున్నాయి. ఈ మధ్య అరుధంతీ రాయ్ రాసిన 'God of Small Things' చదివాను. కేరళ నేపథ్యంలో వ్యక్తి జీవితంలోని సంఘటనలను తీసుకొని ఆమె మంచి టెక్నిక్‌తో నవల అల్లింది. ఆమె మంచి రచయిత్రి.

**ప్ర : అజ్ఞేయ్ లాగా మిమ్మల్ను కూడా భారతదేశంలో విదేశీయునిగా, విదేశాల్లో భారతీయునిగా భావిస్తారు. మీ పైన మిలన్ కుందేరా ప్రభావం ఏమైనా ఉందా?**

జ : దురదృష్ట వశాత్తూ మన దేశాన్ని అర్థం చేసుకోడానికి కావలసిన దృష్టి మన దగ్గర అంతగా లేదు. భారతీయతలో ఉన్న సత్యాన్ని మనం మతానికి సంబంధించిందిగా భావిస్తాం. తర్వాత, పాశ్చాత్య సంస్కృతి కూడా లోతైందే అని ఒప్పుకోం. ఒప్పుకోడానికి ఇష్టపడం.

ప్రతి సంస్కృతికి దాని కొన్ని హద్దులుంటాయి. భారతీయ సంస్కృతికి తన హద్దులున్నాయి. యూరప్ సంస్కృతిలో తన కొన్ని లోపాలున్నాయి. హిందీ సాహిత్యం మూఢత్వాన్ని అంచనా వేయడం మీకు కష్టమేమీ కాదు. ఎందుకంటే 'లేబుల్' తగిలించడం అన్నిటికంటే సులభమైన పని. నిరాశపడి తిట్లు, శాపనార్థాలకు దిగిరావడమంటే ఇదేకదా!

**ప్ర: మునుపు సాహిత్యాన్ని పోల్చడానికి, విశ్లేషించడానికి సంగీతం, శిల్పకళ, చిత్రకళ లాంటి కళల సామ్యం తెచ్చేవారు. ఇప్పుడు పాత్రికేయత, రేడియో, సినిమా, దూరదర్శన్ లాంటి ప్రసార మాధ్యమాల సామ్యం తీసుకురావడం జరుగుతూంది. ఈ మార్పు వల్ల సాహిత్యం యొక్క ఆంతరిక నిర్మాణంలో ఏమైనా మార్పు వచ్చిందా? రాగలుగుతుందా? దీనివల్ల పాఠక సముదాయంలో దాని పాత్ర ఏమైనా మారిందా?**

జ : 19వ శతాబ్దంలో సినిమా, ఫోటోగ్రఫీలను కనుగొన్న తర్వాత చిత్రకళ పైన వాటి ఎలాంటి ప్రభావం పడిందో, సరిగ్గా అలాంటి ప్రభావమే కథ, నవల, కవిత, లాంటి సాహిత్య ప్రక్రియలన్నింటి పైన పడింది. ఈ ప్రభావాన్ని నిషేధాత్మకంగా గానీ, తిరస్కార రూపంలో గానీ తీసుకోకూడదు. భారత దేశంలోను, ఇతర దేశాల్లోను, ఎందరో నవలా రచయితలు ఫిల్మ్ టెక్నిక్‌ను తమ కథాత్మక శైలిలో చాలా సమర్థవంతంగా లీనం చేసుకోగలిగారు. ఫణీశ్వర నాథ్ రేణు (హిందీ) కథాశైలి పైన ఫిల్మ్ ప్రభావం చాలా లోతుగా ఉంది. ఆయన తన 'సీన్ల'ను ఎలా కట్ చేస్తాడు, ఏ విధంగా చిన్న - చిన్న ఎపిసోడ్లుగా విభజించి కథలుగానీ, నవలలు గానీ రాశాడు, అనే దాని పైన చాలా తక్కువ మంది దృష్టి పడింది. దీనికంతటికీ ప్రేరణ కూడా ఆయన పరోక్షంగా ఫిల్మ్ నుండే పొందారు. అదేవిధంగా ఫిల్మ్ వల్ల ప్రభావితులై తమ తొలి నవలలు రాసిన ఇంగ్లీషు నవలా రచయితలు కూడా ఎందరో ఉన్నారు. నిరాలా కవిత్వం పైన సంగీతం ప్రభావం ఉందని మీకు తెలుసు. నిరాలాకు శాస్త్రీయ సంగీతం బాగా తెలుసు. విదేశాల్లో అయితే ఈ ప్రభావం మరింత ఎక్కువ అవుతూంది. కేవలం లయ, శైలి రూపంలోనే కాదు, మొత్తం వస్తువు నిర్మాణ రూపంలో కూడా. ఈ మధ్యనే ఒక రకమైన లోతైన మార్పు రష్యా, తదితర దేశాల నవలల్లో కనిపిస్తూంది. పూర్తిగా symphony composition లాగా వేరు - వేరు భావాల్లో విభజించి ఈ నవలా రచయితలు తమ కథా రచనా విధానాన్ని ఏర్పరచుకుంటున్నారు. నాకిది సహజంగా ఉన్నట్లే అనిపిస్తూంది. దాని ప్రభావం సృజనాత్మకంగా ఉన్నట్లుగా కూడా నాకనిపిస్తూంది. ఎందుచేతనంటే ఏ కళ కూడా తన్ను తాను వెలివేసుకొని ఏకాంతంలో మనలేదు. ఒక మంచి చెట్టు, మొక్క, పువ్వు లాగా అది అన్ని విధాలైన ప్రభావాలను గ్రహిస్తుంది. కానీ తన స్వయం ప్రతిపత్తి (automony)ని అక్షుణ్ణంగా ఉంచుకుంటుంది కూడా. ఫిల్మ్ ప్రభావం పడినప్పుడు ఫిల్మ్‌ను, సంగీతం ప్రభావం పడినప్పుడు సంగీతాన్ని అనుకరిస్తూ పోదు. అది తన కళాత్మక స్వయంప్రతిపత్తిని, అస్మితను కాపాడుకుంటూ వాటిని చెక్కుచెదరనీయకుండా ఉంచుకుంటూ తత్త్వశాస్త్రం, సంగీతం, నాట్యశాస్త్రం, ఫిల్మ్, ప్రసార మాధ్యమాలు (Media) ఈ అన్నింటి ప్రభావం గ్రహిస్తూ పోతుంది.

ప్ర : నేటి వస్తు వినియోగవాద సంస్కృతిలో సాహిత్యాన్ని రక్షించేందుకు (అది చచ్చిపోయిందనే ప్రకటనలు సారిసారికి వెలువడుతున్నాయి) ఎలాంటి చర్యలు తీసుకోవాలి? నేటి సాహిత్యానికి, సాహిత్యకారునికి ఉన్న అన్నిటికంటే పెద్ద బాధ్యత ఏమిటి?

జ : అతడు తన గొంతును రక్షించుకోవాలి.

ప్ర : తన గొంతును అంటే...

జ : కవిత్వం, కథ, నవలలో నుంచి మాత్రమే వెలువడే సాహిత్య సత్యం. దాని స్వయం ప్రతిపత్తిని మనం ఎంతవరకు తెలుసుకోమో, అంత వరకు వస్తు వినియోగ సంస్కృతి ఆక్రమణ దాన్ని నాశనం చేసేస్తుందని మనం భయపడుతూనే ఉంటాం. కానీ నిజానికి అలా జరగదు. మొదటి నుంచీ సాహిత్యం ఇలాంటి ఆక్రమణల మధ్య, లేదా ప్రభావాల మధ్య తన అస్మితను కాపాడుకొనే 'స్ట్రేటజీ'లు వెతుకుతూ ఉంది. నేటి అన్నిటికంటే పెద్ద సవాలు కూడా అదే. ఇప్పుడు కవితలు రావడం లేదా? ఎప్పటి లాగే అందమైన, శక్తివంతమైన కవితలు ఇప్పుడు కూడా వస్తున్నాయి. మన దేశంలోనూ, విదేశాల్లోనూ వస్తు వినియోగ సంస్కృతి పట్ల వ్యంగ్యం, irony కూడా వీటిలో ఉంది. ఇలాంటి ప్రభావాలు నలువైపుల నుండి సమాజంలో వ్యాపిస్తున్నప్పుడు వాటితో సంబంధం తెంచుకోకూడదు. అవి లేనేలేనట్లుగా గానీ, వాటిని ఉపేక్షిస్తూ గానీ, లేక అనాసక్త భావంతోగానీ వ్యవహరించకూడదు. వాటితో ఒక పరస్పర సంబంధం ఏర్పరచుకొని కూడా రచయిత తన స్వరూపాన్ని అక్షుణ్ణంగా ఉంచుకో గలుగుతాడు. ఈ విషయం నేటి ప్రతి సాహిత్యకారునికీ తెలుసు. అతడు తన పనిలో దీన్ని అన్వయించుకుంటాడు కూడా.

ప్ర : సాహిత్యం, రాజనీతి ఈ రెండింటి సమన్వయం ఎలాంటి స్థితిలో వికాసానికి తోడ్పడుతుంది?

జ : సాహిత్యం, రాజనీతి, ఈ రెండూ పరస్పర విరుద్ధ శక్తులని నేను భావించను. సాహిత్యం స్పర్శించని వస్తువంటూ ఏదీ లేనప్పుడు రాజనీతి అయినా అలా ఎందుకుండాలి? మరి సాహిత్యాన్ని ఆక్రమించి దానిపైన పెత్తనం చెలాయించే శక్తి కూడా ఏదీ లేనప్పుడు రాజనీతి అయినా అలా ఎందుకుండాలి? అభ్యుదయ వాదులతో నా భేదాభిప్రాయానికి కారణమిదే— వాళ్ళు సాహిత్యాన్ని, సంస్కృతిని వాటి స్థానం నుండి తొలగించి రాజనీతికి వాటిని నిర్దేశించే శక్తినిస్తారు. మన మార్క్సవాదులు లేదా అభ్యుదయవాదులు రాజనీతిని లేక ఏదైన ఒక ప్రత్యేకమైన రాజనీతిక ఆలోచనాధోరణిని స్వీకరించిన తర్వాతనే మనం మన సమాజాన్ని సరిగా అవగాహన చేసుకోగలమనీ, ఆ తర్వాత ఆ అవగాహన ఆధారంగానే, ఆ దృష్టి ఆధారంగానే మనం సాహిత్య రచన చేయాలనీ అంటారు. నాకు మాత్రం ఈ దృష్టి ఏకపక్షీయమైన దృష్టిగానే తోస్తుంది. వాళ్ళనే మాటకు అర్థం— మనం మన సమస్త అనుభవ స్రోతస్సులను వదలిపెట్టి కేవలం రాజనీతి ద్వారా పొందే ఏక పక్షీయమైన, భౌతికమైన దృష్టి ఆధారంగానే సంపూర్ణ అనుభవ జగత్తు యొక్క చిత్రాన్ని ప్రతిబింబింప చేయాలని! అయితే ఈ పని ఎప్పుడు సాధ్యపడుతుంది? ఎప్పుడైతే నేను సాహిత్యాన్ని పక్కనపెట్టి రాజనీతికి ఆలోచనా ధోరణి ఏజెంటు లేదా Propagandist లేదా ప్రవక్తగా మారుతానో, అప్పుడే అది సాధ్యపడుతుంది. కానీ రచయిత ప్రవక్త కాదు కదా! ఒకవేళ అతడు ప్రవక్త అయితే కేవలం తన ఆత్మానుభవం యొక్క ప్రవక్త. అందువల్ల సాహిత్యం రాజనీతితో తన సంబంధం తెంచుకోకుండా సమతూకంగల పద్ధతిలో దాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలని నేననుకుంటాను.

# కళల ఖజానా సాలార్‌జంగ్ మ్యూజియం

- కాండ్రేగుల నాగేశ్వరరావు

ప్రపంచ పటంలో హైద్రాబాద్ నగరానికి ప్రత్యేక స్థానాన్ని కల్పించటంలో ప్రముఖ పాత్ర వహిస్తుంది సాలార్‌జంగ్ మ్యూజియం. 'సాలార్‌జంగ్' అనబడే ఈ పదం నిజాం రాజుల వద్ద ప్రధాన మంత్రి పదవి నదిష్టించే వారికిచ్చే బిరుదు. నిజానికి మ్యూజియం మూడు తరాల మధుర స్వప్నం. ఆ ముగ్గురూ...

మొదటి సాలార్‌జంగ్ గా పిలువబడుతున్న నవాబ్ మీర్ తురబ్ ఆలీఖాన్.

రెండవ సాలార్‌జంగ్ గా పిలువబడుతున్న నవాబ్ మీర్ లయిఖ్ ఆలీఖాన్.

మూడవ సాలార్‌జంగ్ గా పిలువబడుతున్న నవాబ్ మీర్ యూసఫ్ ఆలీఖాన్.

ఇందులో మూడవ సాలార్‌జంగ్ ముఖ్యుడు. 'దేవుని పైనే నా విశ్వాసం' అని చాటుకొని, కళనే దైవంగా భావించిన తనకి కళారాధనే జీవన సిద్ధాంతం. జీవితాంతం కళను ప్రేమించటంలో తల మున్కలు గావటం వలన కాబోలు తన నిజ జీవితంలో ఎవరినీ ప్రేమించలేక అవివాహితునిగానే ఉండిపోయాడు. అధికారం, అర్థబలం, అభిరుచి, సమృద్ధిగా గల సాలార్‌జంగ్‌ల కళా సేకరణ 19వ శతాబ్దం నుండే ప్రారంభమైంది. 450 గ్రామాలపై వారికి వచ్చే ఆదాయం, సాలీనా 23 లక్షలు. ఇది రెండు ప్రపంచ యుద్ధాల మధ్యకాలం నాటి రూపాయి విలువ. దానితో ఇప్పటి విలువను సరిపోల్చుకొని విలువ నిర్ధారించుకోవాలి.

మూడవ సాలార్‌జంగ్ (13-6-1889 నుంచి 2-3-1949) మరణానంతరం ఈ కళా నిక్షేపాలను, అతని వీలునామా ననుసరించి ప్రజల సందర్శనార్థం ఉంచబడ్డాయి. అప్పటి భారత దేశ ప్రధాని, కళాప్రేమి జవహర్‌లాల్ నెహ్రూ 16 డిసంబరు, 1961వ సం॥లో దీనికి ప్రారంభోత్సవం చేశారు. అప్పట్లో ఇది నయాపూల్ దాటిన తరువాత వచ్చే మదీనా హోటల్‌కు ఎదురుగాఉన్న కమాన్ లోపల దివాన్ దేవిడీలో ఉండేది. ఆ తరువాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించిన భవన సముదాయంలోకి 1968వ సం॥లో మార్చబడింది. అంచలంచలుగా అభివృద్ధి పరచబడిన రెండంతస్తుల భవనంలోఉన్న 38 గదులలో ఈ కళాఖండాలు, దేశ కాలమానం దృష్ట్యా, శైలీ భేదాల ననుసరించి వివిధ రీతులుగా విభజించి అమర్చబడ్డాయి. దీని నిర్వాహణ మన దేశంలోని చెన్నై, ముంబాయి, న్యూఢిల్లీ నగరాలలోని మ్యూజియంల కంటే మిన్నగా ఉంటుంది. అందుకు మ్యూజియం నిర్వాహకులు అభినందనీయులు. సంవత్సరానికి ఒక మిలియన్ (10 లక్షలు) ప్రజలు దీనిని తిలకిస్తున్నారు. దీనిపై వస్తున్న ఆదాయం సాలీనా ఒక కోటికి పైమాటే. నిర్వహణ వ్యయం సుమారు మూడుకోట్లు. ఇందులో సింహభాగం భద్రతా సిబ్బంది జీతభత్యాలకే ఖర్చు అవుతుంది. ఆదాయ, వినియోగాల మధ్యఉన్న లోటును ప్రభుత్వం భర్తీ చేస్తుంది.

ఈ మ్యూజియంలో మొత్తం సేకరించబడ్డ వస్తువులు చిన్నా పెద్దా అన్నీ కలిపి నలభై మూడువేలు పైచిలుకు. కళా ప్రేమయిన సాలార్‌జంగ్ గొప్ప సాహిత్య పిపాసి కూడా. అతను సేకరించిన మొత్తం

కాండ్రేగుల నాగేశ్వరరావు, #5, దుల్హన్ ఎవెన్యూ-2, స్ట్రీట్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాదు-34

పుస్తకాలు యాభై వేలు పైనే. ఇందులో అనేక రిఫరెన్స్ పుస్తకాలు, అరబిక్, పర్షియన్, ఉర్దూ భాషలలో లిఖించబడ్డ వివిధ మత గ్రంథాలు ఉన్నాయి. ఇందులో ఉన్న లిఖిత గ్రంథాలు, అరబిక్ కలీగ్రఫీకి మచ్చుతునకలు. ఇవి అరుదయినవి కావటంతో సామాన్య ప్రజా ప్రదర్శనకు దూరంగా ఉంచబడ్డాయి. భాషా పరిశోధకులు, రిసర్చ్ విద్యార్థులు, అధికారికంగా, అనుమతి పొందిన పిమ్మట వీటిని పరిశీలించవచ్చు.

విలువ కట్టలేని ఈ అపూర్వ సంపదపై చేస్తున్న ఈ విశ్లేషణ, స్థల పరిమితుల దృష్ట్యా విహంగ వీక్షణమే.

మ్యూజియం లోనికి మనం అడుగిడగానే, మన దేశంలోని ఏ ఒక్కచోట కనబడని గ్రీక్, రోమన్ దేశాలకు చెందిన అందమైన పాలరాతి విగ్రహాలు, ఘనీభవించిన బితోవిన్ సంగీతంలా, ప్రాంగణంలో బారులు తీరి, మనల్ని సాదరంగా ఆహ్వానించి, పలకరిస్తాయి. వీటిలో జూలియస్ సీజర్ లాంటి చారిత్రక వ్యక్తులే కాక, గ్రీక్, రోమన్ పౌరాణిక, ప్రకృతి దేవతలతో పాటు, టైటాన్, ఒలింపస్, ప్లూటో, క్యూపిడ్ (మన్మధుడు), చెరుబ్స్ (చిన్న చిన్న బూరలు ఊదుకుంటూ, రెక్కలు కలిగిన చిన్నపిల్లలూ), పాన్ (గొర్రెలను కాచుకునే గోపాల బాలకుడు) లాంటివి వున్నాయి. గ్రీకు, రోమన్ పౌరాణిక గాథలపై అవగాహన వుంటే, మనం దీనిలో కనిపించే భౌతిక సౌందర్యానికే కాక దాని వెనుకనున్న భావసౌందర్యాన్ని కూడా ఆస్వాదించ గలుగుతాము.

మ్యూజియం లోనికి ప్రవేసించిన వారందరూ, ముఖ్యంగా పిల్లలతో వచ్చినవారు మాటిమాటికీ గడియారం చూసుకుంటూ, కంగారు పడుతూ దూసుకుపోయే స్థలం ఒకటుంది, అదే గంటల గడియారం. ఇందులోనున్న ఒక చిన్న బొమ్మ తనగది తలుపు తెరుచుకొని వచ్చి, తన వద్దనున్న సుత్తితో, సమయాన్ని సూచిస్తూ గంటలు కొట్టి తిరిగి తన గదిలోకి వెళ్ళి తలుపు మూసుకుంటుంది. ఇదంతా ఒక కార్టూన్ చిత్రంలోని సంఘటనలా సాగిపోతుంది. పారిస్‌లోని లవ్రే మ్యూజియంలోకి ప్రవేశించినవారు 'మోనాలిజా' చిత్రాన్ని వెదకినట్లుగా, వచ్చిన జనమంతా దీనిని చూడందే మ్యూజియంలోని మిగిలిన వస్తువులపై దృష్టి పెట్టరు. ప్రజాదరణ పొందిన ఎగ్జిబిట్‌లలో దీనిదే ప్రథమ స్థానం. దీనిని ఇంగ్లండ్‌లోని S. Jury Muse Clock And Kelrey Company వారు తయారు చేశారు.

సాలార్‌జంగ్ మ్యూజియంలోని మరో ప్రత్యేకత జేడ్ (Jade) తో చేయబడ్డ వస్తువులు. దివాన్ దేవిడీలో ఈ మ్యూజియం వున్నప్పుడు. జేడ్ వస్తువులు వున్న గదికి ప్రత్యేక రుసుమును వసూలు చేసేవారు. కారణం ఇది అత్యంత ఖరీదయినది కావటమే. జేడ్ అనేది అలంకరణకు ఉపయోగపడే ఒక సిలికేట్ మినరల్. ఇది రెండు రకాలుగా ఉంటుంది. కాల్షియం, మిగ్నీషియం లాంటి కలయికతో ఏర్పడినది నెఫ్రైట్ జేడ్ ఇది ఔషద గుణాలు కలది. మూత్రపిండాల వ్యాధి వున్నవారు దీనిని ఉపశమనం కోసం వాడటంతో దీనికా పేరు వచ్చింది. (Nephrlogy=మూత్రపిండాలకు సంబంధించిన). రెండవ జేడ్ సోడియం, అల్యూమినియంలతో కలసిన పైరాక్సిన్ జేడ్ వజ్రంతో

సమానంగా, మూడింట రెండంతలు గట్టిదనము కలిగిన ఖనిజం. కానీ వజ్రంలా వెలుగును ఏరావర్తనం చేస్తూ, పార దర్శకంగా ఉండదు. చిక్కగా నునుపు తేలిన మెరుపుతో వుంటుంది. అరుదుగా లావండర్, పింక్ రంగులలో లభ్యమవుతున్నా, ఎక్కువ భాగం ఆకుపచ్చ వర్ణంలోనే వుంటుంది. ఇది చైనా, బర్మా, గౌతమేలా, బ్రిటిష్ కొలంబియా (కెనడా) లలో లభ్యమవుతుంది. భారతీయులు బంగారాన్ని, అరబ్బులు ముత్యాలను, ఐరోపా వారు వజ్రాలను మోజు పడేటట్లుగా చైనా దేశస్థులు జేడ్‌తో చేసిన అలంకరణను ఇష్టపడతారు. చైనా చక్రవర్తి కిరీటంలో జేడ్ ముఖ్యపాత్ర వహిస్తుంది. జేడ్‌తో చేసిన ఈ వస్తువులు 28వ నెంబరు గదిలో వున్నాయి. వీటితో పాటు నూర్జహాన్ పండ్ల రసం తాగిన పానపాత్ర, జహంగీర్ ఖైజర్ అపురూపమైన చారిత్రాత్మక వస్తువులు. ఈ సంవత్సరం మొదట్లో పారిశ్రామిక వేత్త విజయ మాల్యా జహంగీరు ఖడ్గాన్నిక దానిని 13కోట్ల రూపాయలకు ఇంగ్లాండులో కొని మన దేశానికి తీసుకొని రావటం, ఒక మరపురాని మధుర ఘటన.

ఇవన్నీ ఒకెత్తు, వీటన్నిటినీ మరిపించేలా, పలుచటి, తెల్లని పరదా చాటున దాగొని వున్న ముగ్ధ మనోహర సౌందర్య రాశి 'రిబెకా' మరొకవైపు. వెన్నెల శిలా సాద్రుశ్యమైన ధవళ కాంతితో మెరిసిపోయే ఈ చక్కటి శిల్పం వెనుక చిక్కటి కథఉంది.

హిబ్రూలకు పూర్వీకుడయిన అబ్రహం తన కుమారుడు 'ఇసాక్'కు పెండ్లి చేయదలచి, అందుకు అన్ని విధాలా అనుకూలవతియైన వధువును అన్వేషించ వలసినదిగా తన భృత్యుడైన హిరన్‌ను పంపుతాడు. పది ఒంటెలతో ప్రయాణం చేసిన హిరన్ దప్పికగొని భగవంతుని ప్రార్థించగా సన్నటి మేలి ముసుగు నఖశిఖ పర్యంతం ధరించిన ఒక యువతి అటుగా రావటం చూసి తనకు దాహార్తి తీర్చమని కోరతాడు. లోతుగా వున్న నీటి చలముల నుంచి నీటిని తోడి అతనికే గాక అతని ఒంటెలకు కూడా నీరు పోస్తుంది. సామాన్యంగా దాహార్తితో ఉన్న ఒంటెలు కడవల కొద్దీ నీటిని తాగుతాయి. శ్రమతో కూడిన ఈ పనిలో కొన్ని నీళ్ళు ఆమెపై చింది, మేలి ముసుగు తడవటంతో, ఆమె అపురూప సౌందర్యాన్ని చూసిన హిరన్ ఆమె ఇసాక్‌కు అన్ని విధాలా తగిన జోడీ అని నిర్ణయించి ఆమెను తన కూడా తోడ్కొని వచ్చి అతనితో వివాహం జరిపిస్తాడు. బైబిల్‌లోని పాత నిబంధనల నాధారంగా వున్న ఈ కథ ననుసరించి, సౌందర్యం, సౌశీల్యం, సహనం ముప్పేర గొన్న ఆదర్శ స్త్రీమూర్తికి మారు పేరుగా 'రిబెకా' అన్న పేరు ఉదహరించ బడుతుంది.

ఈ కథా స్ఫూర్తితో దీనిని శిల్పించిన వాడు ఇటలీ దేశస్తుడయిన Gioranni Battista Benzoni క్లుప్తంగా జి.బి. బెంజోని, ఈ శిల్పం చెక్కడంలో అతని తండ్రయిన జి.ఎమ్. బెంజోనీ సహకారం కూడా ఉంది. మనకు లభించిన ఆధారాల ప్రకారం, బెంజోనీలు శిల్ప నిర్మాణ చాతుర్యంలో పేరుగాంచిన మైఖలాంజిలోకు అంతేవాసిగా చెప్పబడుతున్న మరో ప్రసిద్ధ శిల్పి ఆంటోనియా వేరోనికాకు సమకాలికులు. ఈ చంద్ర కాంతి శిల సౌందర్యానికి ముగ్దుడయిన మొదటి సాలార్ జంగ్

(తన రోమ్ యాత్రలో) డబ్బుకు వేరువ కుండా ఈ సౌందర్య రాశిని లక్షలు వేచ్చించి A.D.1876వ సంవత్సరంలో సొంతం చేసుకున్నారు.

రెండు చదరపు అడుగుల పాలరాతి దిమ్మపైఉన్న ఈ శిల్పం ఎత్తు ఆపాద మస్తకం 167 సెంటీ మీటర్లు (5'6"). ఎడమ కాలిపాదం పూర్తిగా పీఠంపై ఆనిఉంటే, కుడికాలి పాదం మాత్రం ముని వేళ్ళపై నిలచి ఉంటుంది. పీఠం నుంచి శిల్పం వరకూ ఒకటే రాయి వాడబడింది. ఇది 12వ నెంబరు గది. సెంట్రల్ బ్లాక్‌లో, గాజు అద్దాల మధ్య భద్రపరచ బడివుంది. ఇంత వరకూ లభిస్తున్న ఆధారాలను బట్టి, ఇటువంటి శిల్పం ప్రపంచంలో ఇదొక్కటే, ఇదే నిజమైతే ఈ శిల్పానికి విలువ కట్టే షరాబు లేనట్లే. బహుశ దీని బరువును, బంగారం తోనో, వజ్రాలతో తూచి గాని విలువను నిర్ణయించ లేము. బెంజోనీ-డాంటే, విర్జిల్ లాంటి చారిత్రక పురుషుల విగ్రహాలను చెక్కినట్లు తెలుస్తుంది.

దీని తరువాత ముచ్చట గొల్పే మనోజ్ఞ శిల్పం, ఒకే చెక్కలో ద్విపాత్రాభినయం చేస్తున్న 'మెపిసోఫిలస్ అండ్ మార్గరెట్' ఇది ఎర్రటి కలప దుంగ పై చెక్కిన దారుశిల్పం. ఇది ఫ్రాన్స్ దేశం నుంచి తీసుకొని రాబడింది. దురదృష్టవశాత్తు దీని శిల్పి వివరాలు ఇంతవరకూ తెలియ రాలేదు. క్రిస్టోఫస్ మార్లో రచించిన డాక్టర్ ఫాస్టస్, జర్మనీ భాషలో గోధ్ వ్రాసిన 'ఫాస్ట్' నాటకం (ప్రపంచ సాహిత్యంలో పది గొప్ప పుస్తకాలలో ఇది ఒకటి)లోని నాయిక, ప్రతినాయకలు వీరు. కథలోకి వస్తే డాక్టర్ ఫాస్ట్ ఉన్నతాభి రుచితో, ఆశయాలతో ఆదర్శ జీవితాన్ని గడపబోయి, అంతలోనే ఐహిక సుఖాలపై దృష్టి మరల్చి, వాటిని పొందటంకోసం అవినీతికి ఆలవాలమైన మెపిస్టోఫిలస్‌కు తన ఆత్మ నమ్ముకుని, చివరకు తనకు తాను చేసుకున్న ఆత్మ ద్రోహానికి కృంగిపోతాడు. ఫాస్టను ప్రేమించిన ముగ్ధ మనోహరి మార్గరెట్ అతనితో జీవికను పంచుకోలేక ఆత్మహత్య చేసుకుంటుంది. ఈ ఇతివృత్తం ఆధారంగా ఫాస్ట్‌ను ప్రలోభ పరచి, ఇహలోక సౌఖ్యాలవైపు అతని దృష్టిని మళ్ళించిన మెపిస్టోఫిలస్ వికటాహాసంతో ఒకవైపు, నమ్రతతో మౌన ముద్రలోఉన్న మార్గరెట్ మరొకవైపు మనల్ని అలరిస్తారు.

మ్యూజియంలో చిత్రాలు, శిల్పాలతో బాటు తివాచీలు, చెక్కతో చేయబడ్డ గృహోపకరణాలు, చిన్న బొమ్మలతో కూడిన పదివేల బొమ్మల సైన్యం, ఫింగాణీ, వెండి, దంతం, తిమింగలపు ఎముక, చందనపు చెక్క, గాజు వీటిపై చెక్కబడిన అందమైన నగిషీ పనితో అలరించే బొమ్మలు, వస్తువులు ఎన్నో వున్నాయి. ఇందులో ముఖ్యమైనది Mobiliary gem పేరుతో చేయబడ్డ ఫ్రెంచి 15వ లూయిస్ ఉపయోగించిన వ్రాతబల్ల యథాతథ నకలు. ఇందులోని వస్తువులు మన దేశంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిచేరిన హస్తకళా సామగ్రి. మిగిలినవి ఈజిప్ట్, చైనా, జపాన్, ఇరాన్, ఇరాక్, రోమ్, పారిస్, ఇంగ్లండు నుంచి కొనుగోలు చేసినవి.

(విషయ సేకరణలో సహాయ, సహకారాలందించిన మిత్రులు, సాలార్ జంగ్ మ్యూజియం డిప్యూటీ కీపర్ శ్రీ ఎమ్. వీరేందర్ గారికి, తన పరిశోధనా పత్రాలను నాముందుంచిన మరో మిత్రులు బొమ్మగాని కృష్ణగౌడ్‌కు కృతజ్ఞతలు.) (ఈనెల నాల్గు అట్టలపై చిత్రాలు సాలాజంగ్ మ్యూజియంలో)

(మిగతాది వచ్చే సంచికలో)

# తెలంగాణా వచన కవిత - వృత్తుల చిత్రణ

- ఎండ్లూరి సుధాకర్

వర్ణ వ్యవస్థకూ, కులవృత్తికీ విడదీయరాని సంబంధం వుంది. ఆసేతు హిమాచలం వరకూ ఇదే విధానం కనబడుతుంది. 'మహాభారతం'లోనే కాదు మన భారతదేశమంతా కులమే వృత్తిగా, వృత్తులే కులంగా కనబడుతుంది. భారతీయ సమాజంలో బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ, శూద్ర, అతిశూద్ర, పంచమ వర్ణాలే కుల వ్యవస్థకూ, కుల వృత్తులకూ మూల స్తంభాలు. ఇందులో శ్రమించే కులాలు, శ్రమను దోచుకొని సుఖించే కులాలు అనాది నుంచి స్పష్టంగా కనబడుతున్నాయి.

రామాయణ, భారత, భాగవతాల్లోనూ, తెలుగు కావ్యాల్లోనూ, ప్రబంధాల్లోనూ కులవృత్తుల చిత్రణ స్పష్టంగా దర్శనమిస్తుంది. సూత కులస్తులు రథాన్ని నడిపేవారు. 'అయోగత' అనే కులం వాళ్ళు కొయ్యపనులు చేసేవాళ్ళు. 'మాగధ' వంశీయులు సైరంధ్రులు. అలంకరణలు చేయడం వీళ్ళపని. ఈ కులం నుంచే మైరేయక కులం పుట్టింది. వివిధ రకాలైన మద్యపానాలను తయారు చేయడం వీరి వృత్తి. ఆ కాలంలో 'నిషాదులు' చేపలు పట్టడం, పక్షుల్ని వేటాడటం, వృత్తిగా వుండేవారు. బోయలు జంతువేటతో జీవించేవారు. ఇక గిరిజనులకైతే అడవే ప్రధాన ఆధారం. 'మద్రనాభులు' అనేవాళ్ళు గాడిద బళ్ళు నడిపే వాళ్ళు. 'పాండసోపకులు' వెదురుతో బుట్టలు, తట్టలు అల్లేవాళ్ళు. ఇప్పుడు వీళ్ళని మేదరివారిగా వ్యవహరిస్తున్నారు. మహాభారతంలో ధర్మవ్యాధుడు మాంసం అమ్ముకునే వృత్తిలో వున్నట్లు కనబడుతుంది. ఇప్పుడు వీరిని కటిక కులస్తులుగా పిలుస్తున్నారు. అలా చర్మకారులు, పాకీ పని చేసుకునే వాళ్ళు ఎన్నో నీచ వృత్తులు చేసుకునే వాళ్ళను భారతీయ అగ్రవర్ణ సమాజం వీళ్ళ సేవల్ని వాడుకొని వీరిని గౌరవించకుండా దూరంగా నెట్టేసింది. ఏదైనా మంచి వృత్తి చేసుకొని గౌరవంగా బతుకుదామంటే వెలివృత్తులెన్నైనను కులవృత్తికి సాటిరావు గువ్వల చెన్నా" అంటూ దబాయించి వీరి ఆలోచనలను మొగ్గలోనే తుంచివేసేది. ఈ రకమైన శ్రామిక దోపిడి, సాంఘిక దోపిడి ఆధునిక కాలం వరకూ కొనసాగడం శోచనీయం. మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేద్కర్ లాంటి సంస్కర్తలు ఈ తేడాను గుర్తించారు. పునాదుల్ని కదిలించే ప్రయత్నం చేశారు. సర్వమానవ సమానత్వం కోసం ఉద్యమించారు.

ఆధునిక కవిత్వంలో మహాకవి శ్రీశ్రీ :

కమ్మరి కొలిమీ, కుమ్మరి చక్రం / జాలరి పగ్గం, సాలెల మగ్గం
శరీర కష్టం స్ఫురింపజేసే / గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి,
సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలు——

అంటూఎలుగెత్తి వృత్తి చైతన్యాన్ని గుర్తించాడు. శ్రమ సౌందర్యాన్ని గౌరవించాడు.

1980 తర్వాత స్త్రీవాద, దళిత వాద, బహుజన, మైనార్టీ వాదాలు పుట్టాక కులవృత్తులకు ఆత్మగౌరవం పెరిగింది. చారిత్రక దృక్పథంతో కొత్త దృష్టి మొదలైంది. ఆధునిక సమాజంలో తామెలా నలిగి పోతున్నారో గుర్తించారు. ఉత్పత్తి సంబంధాల విషయంలో తామెంత అన్యాయానికి గురౌతున్నారో తెలుసుకున్నారు. మారుతున్న ఆర్థిక వ్యవస్థలో తాము మనలేక పోతున్నామని భావించారు. ప్రపంచీకరణ ప్రభావంలో కులవృత్తులు ధ్వంసమైపోతున్న స్థితిని అనుభవంలోకి తెచ్చుకున్నారు. తమ తమ పీడిత కులాల వృత్తుల ప్రస్తావన ప్రతినిధులుగా కవులు తామే మాట్లాడటం

ఎండ్లూరి సుధాకర్, అసోసియేట్ ప్రొఫెసర్, పొ.శ్రీ. తెలుగు విశ్వవిద్యాలయం,
బొమ్మూరు-533 124, తూ.గో. జిల్లా

మొదలు పెట్టారు. 2001 వచ్చిన 'వెంటాడే కలాలు' (వెనకబడిన సలాలు) కవితా సంకలనం అత్యంత సమర్థవంతంగా కులవృత్తుల సంక్షోభాన్ని కవిత్వీకరించింది.

ఏ దేశంలోనైనా, ఏ రాష్ట్రంలోనైనా పట్టణాల అభివృద్ధికే నగరాల నయా విలాసాలకీ గ్రామాలు బలైపోతుంటాయ్. ఆధునిక పాశ్చాత్య వస్తు సంస్కృతిని గ్రామీణ వృత్తుల్ని చిందరవందర చేసింది. పెద్ద పెద్ద ఫ్యాక్టరీలు పల్లెటూర్ల పనిముట్లను కొండచిలవల్లా మింగేశాయి. నిలువనీడ లేకుండా చేశాయి. నీళ్ళులేకుండా చేశాయి, కన్నీళ్ళు మిగిల్చాయి. ఆకలిని పెంచాయ్. చివరికి ఆత్మహత్యలకు దారి చూపించాయ్. ఈ దోషం వెనుక, ఈ ద్రోహం వెనక అన్ని శక్తులూ వుంటాయన్న నిజాన్ని గుర్తించాలి. కోస్తా ప్రాంతంతో పోల్చినప్పుడు తెలంగాణ ఒక ఎడారిలాగే కనబడుతుంది. చేస్తున్న వ్యవసాయం మూల పడింది. చేతిపనిముట్లు చేతికి రాకుండా పోయాయి. ఉన్న కాస్త భూమిని రియల్ ఎస్టేట్ గద్దలు తన్నుకుపోయాయి. వచ్చిన కాస్త డబ్బు కార్పోరేటు చదువులకు, ఆసుపత్రులకు ఖర్చయిపోయాయి. అప్పులపాలై రెక్కాడితే గాని డొక్కాడని జీవితాలకు రెక్కాడకపోతే దిక్కేది? ఈ నేపథ్యంలో వలసలూ, ఆత్మహత్యలే శరణ్యమయ్యాయి. తెలంగాణాలోని ఏ సామాన్యుడి ఇల్లు చూసినా ఇంటినిండా సమస్యలే. ఒకప్పుడు పూర్ణకుంభంలా వుండే కుమ్మరి జీవితాలు ఎలా ఖాళీ కుండలైపోయాయో నందిని సిద్ధారెడ్డి కవిత మనకళ్ళముందు నిలబెడుతుంది.

"అతని చేతుల్తో
ఎన్ని ఇళ్ళలో దీపాలు వెలిగించిండు
ఇప్పుడు తన దీపంలో నూనె ఇంకిపోయింది.
ఎందరి గొంతుల్లో చల్లటినీళ్ళు జారినయి
ఎందరి ఇళ్ళలో అన్నం ఉడికింది
అతని కుండలో ఇప్పుడన్నం లేదు
ఐరేండ్లలో ఎన్నికోట్ల దంపతులకు
బంధాలు కుదిర్చిండు
ఇప్పుడు ఇల్లుగడవక
ఆ పాత దంపతులిద్దరికీ
ప్రతిదినం తగాదే."

ఇవాళ తెలంగాణా పల్లెలన్నీ కులవృత్తులు కోల్పోయి కూటికి లేక దైన్యంగా దిక్కులు చూస్తున్నాయి. దగాపడ్డ తెలంగాణ పల్లెను 'ఐనాల సైదులు' ఇలా చిత్రించాడు.

"వత్తావా మా వూరికి
పొద్దెక్కినా పొయ్యిలో పడుకున్న
పిల్లిని చూయిత్తా
మా అవ్వ పొంత కుండెట్టి
పొయ్యిమీద తపాల్లో
కటకటా నాల్గుబొట్ల కన్నీళ్ళని కార్చి
మూతెట్టి కూకొని
ఊపిరల నూదే దృశ్యాన్ని చూయిత్తా...
పొగ పొట్టల్కిపోయి ఉగ్గొచ్చినా
ఊపిరి తిత్తుల్ని పక్కకి నెట్టేసి ఊదుతూ
మధ్య మధ్యలో ఆకాశానికేసి చూస్తూ
దగ్గీ దగ్గీ ఒకానొక నిశీధి రాత్రి
దగ్గిన దగ్గులో లటుక్కునూడి పడ్డ
గుండెకాయిని చూయిత్తా
వత్తావా మా వూరు."

ఒకప్పుడు భార్యాభర్తలు గ్రామీణ జీవితంలో ఆడుతూ పాడుతూ పనిచేసేవారు. ఉన్న దేదో తిని అన్యోన్యంగా వుండేవారు. ఇప్పుడు పొట్టకోసం తలా ఒక దిక్కు వెళ్ళక తప్పడం లేదు. మత్స్యకారుల జీవిత మధనాన్ని 'అంబటి వెంకన్న' ఎంత ఆర్తిగా చిత్రించాడో గమనించండి.

"ఏటి చివర మనసు ఎరవేసి కూర్చున్న
బడ్డెంట నీసుకంపుతో నువ్వొస్తున్నపుడు
ఏరొస్తున్న అలజడితో
నీటి బుడగల్లాంటి ఆనందం నాది.
నీ ఒంటిపై
నా బండ పెదాలతో పెట్టిన ముద్దు
వాగై ఎన్ని వంకలు తిరిగిందో
నీ అలుపెరుగని కళ్ళతో
నాకోసం ఎదురెక్కిన చావై
ఈ శోకాల కొంపలో చిక్కినందుకు
నా కంట్లో మేనసముద్రమే ఒదిగింది.
చాపలమ్మి తెచ్చిన
ఎచ్చిపచ్చి వడ్లను పెంక మీద ఏంచి
కుందెన్లో పోసి దంచిన నీ చేతులు
రోకల్లయ్యాక
తీరిగ్గా పేమించుకునే యాళ్ళేది మనకు
మనకై తీరిగ్గా వూపిరి తీసిన రోజేది
కచ్చాల మేకునై నేను ఒండులోకి
చాపల గంపెత్తుకొని నువ్వూళ్ళోకి"

కుల వృత్తులకు ఆదరణ కరువై అదే వృత్తి ఖరీదైన వ్యాపారంగా మారిపోయింది. పాత వృత్తినే నమ్ముకొని బతుకీడుస్తున్న పల్లె జీవితాలు ఎలా పరితపిస్తున్నాయో జి. విజయలక్ష్మి 'పొదిలో కత్తి' కవితలో వేదనాత్మకంగా వ్యక్తీకరించింది.

"మంగలి ఎంకటిగాడివి నువ్వు
కొండ మంగలిగాడి పెళ్ళాన్ని నేను
నాయి బొమ్మడివే
అన్నాయం అని అరవలేదు
ఊరోల్ల రొచ్చంత కడిగొచ్చి
ఉరుమురుమి మంగలానపడ్డట్టు
ఇంటాడ దాని మీద ఇరుసుకు పడతావ్
పేను కొరుకుడు నాయల్లాందరికీ
బొచ్చు గొరిగి గొరిగి
పేనుకు పెత్తనం ఇచ్చినట్టని
నన్నెత్తి పొడుత్తవ్
పండక్కి గంప నిండుద్దని
రోజా పబ్బం గడిపిచ్చావ్
పులిసిపోయిన పులుసు
సద్దికంపు సుద్దపప్పు
తెవులు కొచ్చె తెగులు కూడు
నీ మిరాసి కొంపల సుట్టు తిరిగి తిరిగి
తంగేడు పూవంటి దాన్ని తడికయ్యాను"

అగ్గిపెట్టెలో ఇమిడేంత అందమైన చీరల్ని నేసి విదేశాలకు ఎగుమతి చేసే ఒకనాటి వైభవోపేతమైన చేనేత కార్మికుల జీవితాలు ఇవాళ చిదికి పీలికలయ్యాయి. పూట గడవని స్థితి ఎముకల గూడులాంటి దేహాల్ని ఎక్కువకాలం లాగలేక ఎందరో నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. దానికి కారణాలేమిటో 'పత్తిపాక మోహన్' కవితాత్మకంగా నినదించాడు.

కండల్ని కండెలా చుట్టి
నరాల పోగులకు రక్తాన్ని రంగుపూసి
చచ్చీచెడి నిలబడితే ఆకలి చావులే శరణ్యమయ్యాయి
నిన్న పురుగు కాటేసింది
నేడు పోగు ఉరేసింది.

ప్రాచీన కాలంలో ధావకులుగా రజకులకు ఒక ప్రత్యేక స్థానముండేది. అటు 'రామాయణం'లోనూ, ఇటు 'భారతం'లోనూ కన్పిస్తారు. రాను రాను చాకలి వాళ్ళ జీవితాలు కూడా మసిగుడ్డలుగా మారిపోయాయి. ఈ నేపథ్యాన్ని చారిత్రక స్పృహతో 'జూపల్లి ప్రేంచంద్' బట్టబయలు చేస్తున్నాడు.

"ఊరిలో సవర్ణుల పెళ్ళైతే నా వాళ్ళు సంబరపడి
తమ దేహాలను పడుపు కోకలుగా పరిచారు
ఊరేగింపుల్లో దివిటీలై వెలిగారు
పండగ పబ్బాల్లో ఇంటి వెల్లలై మెరిశారు
రోజంతా నానా యాతనా చేసి
చివరకు ఇల్లిల్లూ తిరిగి
వెట్టి చీకట్లో ఎంగిలి బుట్టలై మిగిలారు
ఇప్పటికీ ఓ ఇస్త్రీ పెట్టెకోసమో
ఓ డ్రమ్ముకోసమో ఓ దోభీ ఘాట్‌కోసమో
దేబిరిస్తూ అమాయకంగా ఎదురుచూస్తూ..."

భారతీయ కులవ్యవస్థకు బలి పశువులైంది. దళిత బహుజన స్త్రీలేననడం పరమ వాస్తవం. శారీరకంగా, మానసికంగా ఆర్థికంగా వాళ్ళను కొల్లగొట్టారు. తెలంగాణా పల్లెల్లోనయితే అగ్రవర్ణ భూస్వాములు పసిమొగ్గలుగా వున్నప్పుడే చిదిమేశారు. సుఖాలందించటం కోసమే సృష్టించబడ్డ కులం ప్రపంచంలో ఎక్కడా లేక పోవచ్చు. కులం పేరైతే భోగం. అనుభవించే వారికి మాత్రం భోగాలు. వీరికి మాత్రం నిత్యం రోగాలు. కోర్కెలు తీర్చుకున్నాక చీదరింపులు, చీత్కారాలు. తన కులం బాధను తన బాధగా అక్షరీకరించిన 'ప్రసేన్' కవితా పాదాలను స్పృశించండి.

"నా కులానికే శీలం లేదుకదా
మరి కులం గొప్పదా శీలం గొప్పదా
భలే అదృష్టం నా కులం పేరు చెబితే
లంజతనం గుర్తొస్తుంది.
భోగం వేషాలు! భోగం దానా! భోగం మేళం!
హింసను నవ్వులాటగా మార్చేంత హింసచాయామాటలు
ఎంతైనా నీది ఊరు...నాది భోగంవాడి"

తెలంగాణ ప్రాంతపు అవుసులోల్లు (స్వర్ణకారులు) తమ నైపుణ్యంతో నవాబుల్ని మెప్పించారు. మహారాజుల్ని రంజింపజేశారు. పెద్దపెద్ద కంపెనీలొచ్చాక కూలీలుగా మారిపోయారు. గుండెల మీద కుంపట్లు పెట్టుకొని బతుకుతున్నారు. 'బాణాల శ్రీనివాసరావు' తన బాధను ఇలా వ్యక్తీకరించాడు.

"కుంపటి మా ఇళ్ళకు వెలుగు
మా చీకటి బతుకుల నావకు దిక్సూచి
అది మా నాయనకు ప్రతీక...మా తాతకు ప్రతీక
మా తరతరాల వారసత్వాల కులవృత్తికి చిత్రిక
ఈ సమస్త విశ్వం తిరిగేది
మా కంసాలోళ్ళ కుంపటి చుట్టే
అది నిరంతరం మండే అగ్నిగోళం"

..................................................................

..................................................................

ఈ దేశంలో ఏ రోడ్డు మీద చూసినా, ఏ పల్లెటూళ్ళో చూసినా తలలు వంచుకొని చెప్పులు కుట్టుకుంటూ వీధినపడిన జీవితాలు గురించి, శ్రమకు తగిన ఫలితం దొరకని దోపిడీ గురించి 'కర్రి విజయకుమారి' రాసిన కవిత కన్నీరు పెట్టిస్తుంది.

దొరకు, దొర్సానమ్మకు
కుట్టమని కబురు.
మిగిలే తోలుసెల్లలో
దీనంగా నా బుల్లోడి మొఖమే
సోం బువ్వన్నా పెట్టిత్తారేమోనని
నడుములాగేలా
సేతులు నొప్పెట్టేలా గూటంతో సాగదీసి
ఉడిగిన సత్తువ ఊడ గుంజుకొని
ఆరెతో రంధ్రాలు ఏసి చెప్పులు చేస్తి.
సత్తుగిన్నెలో సెప్పులెట్టుకొనొచ్చి
మీ అరకాళ్ళకు ఆముదం రాసి
సెప్పులు తొడిగితే
'దీనికి కవల మెట్టు' అన్నాడు దొర
నేను పడ్డ కట్టానికి
దొర్సానమ్మి తెచ్చి
నా సత్తుగిన్నెలో పడేసె పాచిన సోంబువ్వ"

తెలంగాణాలో చాలా వృత్తులు వికలాంగులయ్యాయి. పరికరాలు మూలబడ్డాయి. పెద్దపెద్ద కంపెనీల వస్తువులే పల్లెల్లోకి తరలివస్తున్నాయి. రోజుకో కొత్త వస్తువు వచ్చి కుల వృత్తుల కడుపు గొడుతున్నాయి. ఈ పరిణామానికి తన కళ్ళముందే వడ్ల వృత్తి ఎలా కనుమరుగయిందో కనుగుడ్లలో నీళ్ళు నిపుకొని 'అన్నవరం దేవేందర్' ఇలా ఆవేదన చెందాడు.

"ఎలుగటి నాగలి చెక్కే పెద్ద బాడిస అటకెక్కింది
పెద్దచక్రం నొగలు చేసే పెద్దేగి కర్రేదీ?
గొర్లు, గుంటకలు, బండి గొరెలు చేసిచ్చుడే మర్శిండ్రు
ట్రాక్టర్లు, మిషన్లు, ఊరినిండినయి
వడ్లమల్లయ్య వాకిట్ల చెట్లు మొలిచినయి."

తెలంగాణాలో కొలుపులోళ్ళ జీవితాలు అత్యంత దయనీయంగా వుంటాయి. పెళ్ళిళ్ళకూ, చావులకూ వీళ్ళే పెద్ద దిక్కు. ఆకలితో నకనకలాడుతున్నా నాలుగుమెతుకుల కోసం వీళ్ళు చిందువేస్తారు. జాతర్లకు, రాజకీయ నాయకులు ఊరేగింపులకు ముందు వీరు డ్యాన్సులు చేస్తారు. ఈ వాస్తవాన్ని 'మోతుకూరు అశోక్' కళ్ళకు కట్టినట్లు చిత్రీకరించాడు.

"గట్ల శిత్రంగ జొడకుండ్రి బాంచను
పెయినిండ గీపేగులు జుట్టుకున్నందుకు
గట్ల శిత్రంగ జూడకుండ్రి మా పానాలవిశిపోతయి
లగ్గాలచ్చినా సావులొచ్చినా ఆళ్ళ ముంగటాడాలె
ఆళ్ళ పీన్గుల మందటాడాలె
మా పోరగాండ్లు పానలాలేర్కుంటరు
మేం పైసలేర్కుంటం"

ఇలాంటి బతుకులు తెలంగాణాలోనే కాదు, భారతదేశమంతా ప్రత్యక్షమవుతాయి. కుతకుతలాడుతున్న కులవృత్తుల సంక్షోభాలు మానని గాయాలనీ మిగిల్చాయి.

ఇలా చెప్పుకుంటూపోతే సమ్మక్క సారక్క జాతరంత అవుతుంది. తెలుగు సాహిత్యం నమోదు చేయని ఎన్నో ఛిద్ర జీవితాల్ని, కులవృత్తుల్ని తెలంగాణా సాహిత్యం ఒడిసి పట్టుకుంది. వందలాది కవులు అద్భుతమైన పనితనంతో నిబద్ధత, నిమగ్నతతో నిజాల్ని ఆవిష్కరించారు. తెలంగాణా వచన కవితకు కవులు పూర్తి న్యాయం చేశారు. సమాజంలోని విభిన్న కులవృత్తుల చీకటి కోణాలను అక్షరీకరించారు. తెలంగాణా కవి తన అస్తిత్వవేదన నుంచి అంతర్జాతీయ పరిమాణాల్ని సైతం అవలోకిస్తున్నాడు, అక్షరీస్తున్నాడు. ఇప్పుడు సాహిత్య ప్రపంచం చూడాల్సింది ఏ ఆంగ్లకవినో, అమెరికన్ కవినో కాదు. తెలంగాణా కవినీ, వాళ్ళ కవిత్వాన్ని చూడమంటాను. ఆధునిక తెలుగు కవిత్వంలో తెలంగాణా ముద్ర అజరామజం.

# సాగరాలు - జరుగుతున్న పరిశోధనలు

- సి.వి. సర్వేశ్వర శర్మ

సైన్సు ఎంత అభివృద్ధి చెందినా ఇంకా ప్రకృతిలో మనిషికి అంతు బట్టని రహస్యాలు ఎన్నోఉన్నాయి. ఇటువంటి రహస్యాలను ఎన్నిటినో తనలో దాచుకున్న వాటిలో సముద్రం ఒకటి. సాగర గర్భాల్లోకి పయనించి పరిశోధకులు ఎప్పటికప్పుడు కొత్త కొత్త విషయాలు తెలుసుకుంటున్నారు.

సాగర గర్భంలోని అగ్నిపర్వతాల విస్ఫోటనం వల్ల సముద్రం అడుగుడభాగం అయస్కాంత ప్రభావానికి లోనైందని తెలుసుకున్నారు. సాగరాలలో నిల్వవున్న ఖనిజ సంపదల గురించి అధ్యయనం చేయగలిగారు. టిటానియం నిల్వలు, మాంగనీసు ఖనిజాల సంపదలు, ఆయిల్ నిక్షేపాల గురించి తెలుసుకోగల్గుతున్నారు. శత్రు దేశాల జలాంతర్గాములు, సముద్రాలలో ఎంత అడుగు నుండి దూరంగా, నిశ్శబ్దంగా ప్రయాణిస్తున్నా ఇట్టే పసిగట్టగల్గుతున్నారు.

**పగడాల దిబ్బ:** సముద్రం అడుగున వున్న కోరల్ రీఫ్స్‌ను మనం పగడాల దిబ్బగా చెప్పుకుంటాము. ఇది కొన్ని దశాబ్దాలలో కనుమరుగు కానుందా? అని శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు.

కోరల్స్ అనేవి ఒకటి రెండు కాదు కొన్ని వందల రకాలుగా వున్నాయి. ఒక్క ఆస్ట్రేలియన్ గ్రేట్ బారియర్ రీఫ్‌లోనే **429** కోరల్ జాతులు వున్నాయి. వీటికి ఏమాత్రం ప్రమాదం వాటిల్లినా పర్యావరణం పై దాని ప్రభావం ఉంటుంది.

కోరల్స్ రకరకాల ఆకృతుల్లో ఉండే ఒక నిమ్నజాతి జంతువు అని చెప్పుకోవచ్చు. ఎన్నెన్నో స్పర్శకాలతో ఉండే జలచరం అది. వీటి శరీర కళేబరాలు కాల్షియమ్‌తో నిండి ఉంటాయి. ఇవి రకరకాల విష పదార్థాలను ఉత్పత్తి చేస్తూ ఉంటాయి. ఈ విష పదార్థాలు మనుషుల దీర్ఘరోగాలను నయం చేయగల ఔషధాల తయారీకి పనికి వస్తాయి.

పెద్దపెద్ద కోరల్స్ సమీప జంతువుపై విషం జిమ్మడం మాత్రమేకాదు సమీప సముద్ర జలాలను కూడా విషపూరితం చేస్తాయి. ఈ కోరల్స్‌ను నాశనం చేయడంలో మనిషి తనవంతు విశేషంగా కృషి చేస్తున్నాడు. ఇది విచారించతగ్గ విషయం.

**మానవ హాని:** మనిషి కోరల్స్ నాశనం చేస్తున్నాడు. గ్లోబల్ వార్మింగ్, చేపల్ని అసంఖ్యాకంగా పట్టివేయడం, సముద్ర జలాల్ని కలుషితం చేయడం వంటి పనులు కోరల్స్ పాలిట శాపాలవుతున్నాయి. తుఫానులు, తోకచుక్కల దాడి, హిమ యుగాల తాకిడి వంటివి కోరల్స్‌కు ప్రమాదాలు తెచ్చిపెడుతున్నవే.

కోరల్ ఎకాలజీ, కోరల్ కెమిస్ట్రీ శాఖలలోని పరిశోధుకులు వీటిపై పరిశోధనలు చేస్తున్నారు.

**కోరల్స్ ఎలా ఉంటాయి?** కోరల్స్ కొన్ని వేల సంఖ్యలో సూక్ష్మాతి సూక్ష్మమైన టెంటికల్స్, స్పర్శకాలతో ఉంటాయి. వీటి ఆకారాలు వేలాది రూపాల్లో ఉంటాయి. కొన్ని చెట్ల రూపంలో, మరి కొన్ని దుబ్బల రూపంలో, పళ్లాల రూపంలో, శిలల రూపంలో, బండరాళ్ళ రూపంలో ఉంటాయి.

చేపలు, లోబ్‌స్టర్స్, మొలాస్కులు, ఆక్టోపస్‌లు, సీ-ఎనిమోన్స్ వంటివి ఈ ఆకారాల మధ్య తలదాచుకుంటాయి. ఈ కోరల్స్ విడుదలచేసే విషాలతో ఎన్నెన్నో కొత్తకొత్త ఔషధాలు తయారు చేయవచ్చునంటున్నారు ఈ రంగంలోని పరిశోధకులు. కడుపునొప్పి తగ్గేందుకు, వాయువుకు ఉపశమనంగా ఉండే మందుల తయారీ సాధ్యం అంటున్నారు. వీటితో ఎయిడ్స్‌కు చికిత్స చేయగల

'సైన్సుచక్రవర్తి' - సి.వి.సర్వేశ్వరశర్మ, ప్రెసిడెంట్ - కోనసీమ సైన్సు పరిషత్,
కృష్ణమూర్తి వీధి, అమలాపురం - 533 201

మందులు కూడా తయారు చేయవచ్చని కొందరి అభిప్రాయం. కోరల్స్ విష ప్రభావానికి కొన్ని జాతుల కోరల్స్ మరణిస్తున్నాయి. కొన్నయితే మరణం లేకుండా బ్రతికేస్తున్నాయి. బండరాళ్ళ రూపంలో వున్న కొరల్స్ కొన్ని శతాబ్దాల కాలం నుండి జీవిస్తున్నాయని వారి అభిప్రాయం.

1980లో 'హరికేన్ ఆవెన్' కారిబియాన్ దీవుల్లో వచ్చింది. ఈ తుఫాను దెబ్బకు కొమ్ములు తిరిగిన జింకలు మాదిరి రూపంగల కోరల్స్, శాఖోపశాఖలుగా పెరిగినవి తుడిచిపెట్టుకు పోయాయి. అయితే తిరిగి మళ్ళీ అవి తలెత్తి రూపొందడం విశేషం. ఇంతటి బలమైన ప్రత్యుత్పత్తి శక్తి గల ఈ జాతి మానవుని వికృత చాష్టలకు కనుమరుగై పోతుందేమోనని శాస్త్రవేత్తలు భయపడుతున్నారు.

సముద్రాల అడుగున దాగివున్న ఈ కోరల్స్ పైకూడా మనిషి తన ప్రభావం చూపడానికి వెనుకాడక పోవడం ఇచట కొసమెరుపు.

**మానవ నేత్రానికి చిక్కనవి!** : మనిషి నేత్రానికి దొరకని ఎన్నో జీవులు సాగరాల్లో ఉండడం మరొక విశేషం. ఈ జీవుల్లో కొన్ని చాలా పెద్దవి కూడా ఉన్నాయి. స్క్విడ్ చేప అరవై అడుగులు పొడవు వుంటుంది. ఈ జాతి చిన్న చేప కూడా మన పెద్ద లారీ సైజులో ఉంటుంది.

ఈ స్క్విడ్ చేపలు సాగర అగాథాల్లో ఉంటాయి. అచటకు కాంతి కిరణం అనేది చొరలేదు. దీని గురించి 1870లో తొలి రికార్డు లభించింది. అప్పట్లో మత్స్యకారులు తమకు దొరికిన ఒక స్క్విడ్ చేపకొమ్మును అమెరికాలో ఒక శాస్త్రవేత్తకు బహూకరించారు. అది స్క్విడ్ చేప తంతువుల్లో చివరి భాగంగా ఆ శాస్త్రవేత్త గుర్తించాడు. ఈ స్క్విడ్ చేపలు చచ్చిపోయినవి, చచ్చిపోతున్నవి సాగర తీరాలకు రావడం చాలామందికి తెలుసు. కాకపోతే ఇవి సాగరగర్భంలో తమ నివాస ప్రాంతాల వద్ద ఈతకొడుతూ ఉండగా చూసిన వారెవ్వరూ లేరు. 'ఆర్కిటూతిస్' వంటి వేలాది జలచరాలు సముద్రం అడుగున ఇప్పటికీ ఉన్నాయని అయితే వాటి గురించి మనిషికి ఇంత వరకు ఏమీ తెలియదని శాస్త్రవేత్తలు ఒప్పుకుంటున్నారు.

సముద్ర జలాల దిగువ భాగంలో జెల్లీఫిష్, ఎనిమోన్స్, కోరల్స్, మొలస్కా, క్లామ్స్ వంటి సాధారణ సముద్ర చరాలే కాదు, అసాధారణమైన లాంప్ షెల్స్, పీనట్ వార్మ్స్, మాస్ యానిమల్స్, రిబ్బన్ వార్మ్స్, ఇంకా పేరేమి లేని జీవులు వేల సంఖ్యలో ఉంటున్నాయని పరిశోధకులు భావిస్తున్నారు.

కాంతి చొరని అగాధాల లోతుల్లోకి చాలా శక్తివంతమైన కెమేరాలతో చూడగలిగితే 'మరో ప్రపంచం' కన్పిస్తుందని వీరి ఊహ.

**ద్వీపాలు ఏమవుతున్నాయి?** పది లక్షల సంవత్సరాల నుండి ఓహూ ద్వీపంలో సగభాగం కనుబడుటలేదు. అది ఏమయ్యిందో శాస్త్రవేత్తలు ఆరాతీస్తూనే ఉన్నారు. ఓహూ ద్వీపంలోంచి ఒక ముక్క విరిగి సముద్రంలో పడిపోయింది. భూమి లోలోపల కరిగిన శిలాద్రవం లావాగా భూమిపైకి ఉప్పొంగింది. ఈ లావా కారణంగానే ద్వీపాలు అవతరించాయి. హవాయి ద్వీపాలలో కొండరాళ్ళు విరిగిపడడం వల్ల, సముద్రంలో లేచిన కెరటం ఉప్పెన రూపం ధరించి 2300 అడుగుల ఎత్తుకు లేచి ఆకొండ రాళ్ళను సముద్రం లోపల 15వేల అడుగుల వరకు విసిరి వేసిందని తెలుసుకున్నారు.

గ్లోరియా అనే సోనార్ వ్యవస్థ ఆధారంగా ఒకేమారు 60 మైళ్ళ విస్తీర్ణంలోని సముద్ర అగాథాలలోని నైసర్గిక స్వరూపాన్ని చిత్రపటంగా పొందేవీలుంది. దీనిని బ్రిటిష్ పరిశోధనా నౌక 'ఫార్నెల్లా' వెనుక వేలాడదీసి సముద్రంపై పరిశోధనలు చేస్తున్నారు. దీని ఆధారంగానే ఓహూ ద్వీపంలోంచి ముక్క విరిగి సముద్రంలో పడిపోయిందని తెలుసుకోగలిగారు. హవాయి ద్వీపం గురించిన సమాచారం వెలుగులోకి వచ్చింది. సాగర గర్భంలోకి వెళ్లి పరిశోధనలు జరపగల అధునాతన పరికరాలు అందుబాటులోకి వస్తున్నాయి.

# తెలుగులో నూతన పద నిర్మాణం : ఆవశ్యకత-పద్ధతులు

- డా॥ రేమిల్లి వేంకట రామకృష్ణశాస్త్రి
- డా॥ అద్దంకి శ్రీనివాస్

వ్యవహారభాష పరిణామశీలి. కాలానుగుణ ప్రభావానికి, అవసరాలకు లోనై, తన స్వరూపాన్ని మార్చుకుంటుంది. అనేక రకాలుగా ఉండే ఈ పరిణామశీలత ఆధునిక తెలుగు భాషకు అనివార్యం.

శాస్త్ర సాంకేతిక రంగాలలో ప్రపంచమంతా అభ్యున్నతిని సాధిస్తున్న తరుణంలో భారత దేశం అందులో పాలుపంచుకోవడం వల్ల ఆయా ప్రభావాలు దేశంలోని అనేక వ్యవస్థల మీద, పౌర్వకాలిక స్వరూపాలను సమూలంగా మార్చేంతగా పని చేస్తున్నాయి. వీటి నుండి భారతీయ భాష మినహాయింపు కాదు. ఈ నేపథ్యంలో తెలుగు భాషను పరిశీలిస్తే - కొన్ని సాంకేతిక రంగాలకు చెందిన వ్యక్తుల భాషణ - లేఖనాదుల్లో అసలు తెలుగు భాషను, దాని వ్యవహారాన్ని దుర్భిణీ వేసి వెతకవలసి వస్తుందంటే అతిశయోక్తి కాదు.

దీనికి కారణం ఆయా సాంకేతిక పారిభాషిక పదాలకు తెలుగు పదాలు లేకపోవడమే. అలా అని అన్ని రంగాలకు సంబంధించిన పారిభాషిక పదాలకు మారుగా తెలుగులో పద రూపకల్పన చేయాలని కాదు. సాధ్యమైనంత వరకూ అవగాహనా క్షమతకు భంగం వాటిల్లనంత వరకు, ఆయా సాంకేతిక పదాలకు ఆంగ్ల భాషా పదాలతోపాటుగా ప్రాంతీయమైన భాషలలో రూపొందించడం తప్పుకాదు. ఈ విషయమై సాధ్యా సాధ్యాలను, అవసరాలను నూతన ఆలోచనలను విశ్లేషించి, తగిన విధంగా కృషి చేయవలసిన అవసరం ఎంతో ఉంది. ఆ బాధ్యత భాషా శాస్త్రవేత్తల మీద ఉంది.

ఆంగ్లాది పదాల వ్యవహారం అనివార్యమైన సందర్భాలలో కూడా ఆలోచించి, ప్రయత్నం చేస్తే కొన్ని నూతన పదాలను, పదబంధాలను కల్పించి, ఆయా ఆంగ్ల పదాలతో పాటు దేశీయమైన పదజాలాన్ని కూడా వ్యాప్తిలోనికి తీసుకురావచ్చు. ఇది మొండిగా అన్యభాషా పదాలను తిరస్కరించే ఛాందస వైఖరి కాదు. మన భాషకు సంబంధించినంత వరకు అస్తితత్వాన్ని విస్తరింపచేసే ప్రయత్నంలో ఒక భాగమేనని గుర్తుంచుకోవాలి.

ఇలా నూతన పదబంధాలను నిర్మించేటప్పుడు గాని, లేదా నూతన అర్థాలలో కొన్ని పదాలను స్థిరీకరించేటప్పుడు గానీ ఏర్పడే అవరోధాలను తొలగించడంకోసం కొన్ని సూచనలను ప్రస్తావించడమే ఈ వ్యాసప్రయత్నం.

1. ఆధునిక యుగం అనేక విధాలుగా అనేక మిశ్రమాలకులోనై ఉంది. వ్యాపారం, ఉద్యోగం, సంస్కృతి, విజ్ఞానం వంటి వెన్నో కారణాలు. ఈ ప్రభావాల వల్ల ఆధునిక వస్తుసముదాయం పరస్పరం జన సమూహాలలోనికి వినిమయం అవుతూ ఉంటుంది. ఇటువంటప్పుడు సర్వసాధారణంగా మాతృకగా ఉన్న వ్యవహార నామానికి సంబంధించిన పదాలనే స్వీకృత భాషల వారు కూడా వ్యవహరిస్తారు. వీటికి సంబంధించి స్వీయ భాషలలోనూ రూపాలను కల్పించుకోవచ్చు. అప్పుడు ఆధునిక వస్తువులకు ప్రత్యామ్నాయంగా, అదే అర్థం స్ఫురించే విధంగా నూతన పదబంధాలను కల్పించవచ్చు. తెలుగు వ్యవహారంలోనూ, ప్రాచీన సాహిత్య భాషలోనూ శోధిస్తే, సాధించవచ్చు.

ఉదా : చాక్‌పీస్-సుద్దముక్క; డబుల్ కాట్-ఇరుసెజ్జ మొ..

---

డా॥ రేమిల్లి వేంకట రామకృష్ణశాస్త్రి, రీడర్, హైదరాబాద్.

డా. అద్దంకి శ్రీనివాస్, లెక్చరర్, తెలుగు శాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

2. బాగా వ్యవహారంలో స్థిరపడిపోయిన అన్య దేశ్యపదాలకు కొత్తగా తెలుగులో నూతన పదబంధాలను సృష్టించడం వల్ల గందరగోళ పరిస్థితి ఏర్పడుతుందనిపించినప్పుడు చేయకపోవడమే మంచిది.

3. నామాన్ని కల్పించేటప్పుడు, ఆ పదాన్ని కర్త్రర్థంలో ఉపయోగిస్తున్నామా లేదా కర్మ కరణ భావార్థాలలో ఉపయోగిస్తున్నామా అనే అంశాన్ని గమనించి, అదే అర్థం వచ్చేలా తెలుగు పదాన్ని కానీ, తత్సమ పదాన్ని కానీ కల్పించాలి.

ఉదా: వికారము-వికరణము-వికృతము-వికృతి

4. ఇలా నూతన పదాలను, పదబంధాలను కల్పించేటప్పుడు, ఆయా అర్థాలను గమనిస్తూ, ప్రాచీన సాహిత్య భాష నుండి, లేదా వ్యావహారిక భాష నుండి సమానర్థకాలయిన పదాలనే స్వీకరించాలి. అవి సాధ్యమైనంత వరకూ ప్రసిద్ధిలో ఉండాలి.

5. ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాలకు సంబంధించిన పారిభాషిక పదాలకు తెలుగులో కూడా ఆంగ్ల పదాలనే ఉపయోగిస్తున్నాం. ఇవి ఇప్పటికే అధిక ప్రాచుర్యాన్ని పొందాయి. నామవాచకాల సంగతి అటుంచి క్రియలను కూడా యథేచ్ఛగా ఆంగ్ల క్రియలనే వాడుతున్నాం. వీటి బాహుళ్యాన్ని తగ్గించి, తెలుగు క్రియా వినియోగాన్ని పెంచాలంటే ముందుగా భాషావేత్తలు కొన్ని ప్రయత్నాలు చేయాలి. అంటే వివిధ రంగాలలో వాడే ఆంగ్ల క్రియలను ఏఏ అర్థాలలో వాడుతున్నారో సేకరించాలి. వాటికి తగిన తెలుగు క్రియలను ఎంపిక చేసి కొన్ని పట్టికలు తయారు చేయాలి. నిత్యం జన వ్యవహారం ఎక్కువగా జరిగేచోట ప్రయోగాత్మకంగా తెలుగు క్రియలను ప్రవేశపెట్టడం ద్వారా ప్రయోజనం చేకూరుతుంది. ఉదాహరణకు మనం నిత్యం వాడే క్రియలకు బదులుగా తెలుగులో ఇలా వ్యవహరించవచ్చు. బుకింగ్-నమోదు; రిజర్వు-ముంగాపు (దీనినే హిందీలో అరక్షణ్ అంటున్నారు). ఆక్యుపేచేయు-అధివహించు; డౌనగు-క్రిందగు; స్కిప్ చేయు-దాటవేయు; సేవ్ చేయు అనే క్రియకు సందర్భాన్ని బట్టి రక్షించు/భద్రపరుచు అనే క్రియారూపాలను ప్రత్యామ్నాయంగా చూపవచ్చు.

6. పై విధంగా ఆంగ్ల క్రియలను సమానార్థకాలుగా తెలుగు క్రియలను ఎంపిక చేసేటప్పుడు అవి తెలుగు భాషలో అప్పటికే వేరొక అర్థంలోకానీ, నింద్య/అప్రసిద్ధార్థాలలో కానీ ఉండకూడదు. ఉదా: ఫైరింగ్‌కు తగలెయ్యి తగలెట్టు అనే పదాలను వాడకూడదు. దీనికి ప్రస్తుతం వేరే అర్థం ఫైర్ - మంట/మండు: ఫైరింగ్ - కాల్చు ఉంది. దహించు అనవచ్చు.

ఆంగ్లంలోని నామ వాచకాలకు తెలుగు క్రియలను చేర్చి వాడే సందర్భంలో భావార్థాన్ని గ్రహించి సమానార్థకాలను చూపవచ్చు. ఉదా: అవుట్ చేయు-ఓడించు, అవుట్ అగు-ఓడిపోవు, అవుట్‌ఇచ్చు-ఓడిచ్చు.

7. అప్పటికే స్థిరపడిన అన్యభాషాపదానికి గానీ, పదబంధానికి గానీ ప్రత్యామ్నాయంగా మరో రూపాన్ని వాడుకలోనికి తేవాలంటే, ఆ రూపం వాడుకకు అనువుగా ఉండాలి. మూల రూపంకంటే సులభంగానూ, అందరికీ ఆమోదయోగ్యంగానూ ఉండాలి. ఇలా రూపొందించేటప్పుడు సంస్కృత సమపదాలతో కూర్చేటట్లయితే, అవి తెలుగు వ్యవహారానికి సుపరిచితాలై ఉండాలి గానీ, ఎక్కడో మారుమూల పదాలు కాకూడదు. తెలుగు భాషలో బాగా కలిసిపోయి, తెలుగు పదాలే అన్పించేంతగా

వ్యవహారంలో ఉన్న తత్సమ పదాలను ఉపయోగించి నూతన పదబంధ నిర్మాణాలను చేస్తే, అవి సులభంగా వ్యవహారంలోనికి రావడానికి అవకాశం ఉంటుంది.

8. ఇప్పటికే స్థిరపడి ఆంగ్లపదాలకు మళ్ళీ తెలుగు రూపాలను కల్పించడం వల్ల ప్రయోజనం ఏమిటి? అనే ప్రశ్న చాలా మందికి కలగవచ్చు. అయితే ఇప్పటికి కూడా కొన్ని ఆంగ్లపదాలకు తెలుగులో చక్కని పర్యాయపదాలు వాడుకలో ఉన్నాయి. వాటిని ఆంగ్ల పదాలతోపాటు చక్కగా వ్యవహరిస్తున్నాం.

ఉదా: కాలేజ్-కళాశాల; స్కూల్-పాఠశాల; ఆఫీస్-కార్యాలయం.

ఇలా ఎన్నో పదాలు ఆంగ్లంతో పాటుగా తెలుగులో కూడా వ్యవహారంలో ఉన్నాయి. కాబట్టి ఇలా చేస్తే తెలుగుభాష పరిపుష్ఠం అవుతుంది. ఈ పద్ధతిలో సాధ్యమైనంత వరకు కొన్ని రూపాలను కూర్చుకోవచ్చు.

ఉదా: ఇంటర్నెట్-అంతర్జాలం/లోపల; చాటింగ్-సంవాదం;

ఫైల్-దస్త్రం; ఎడిట్-కూర్చు;. ఎడిటింగ్-కూర్పు;

ఓపెన్-తెరువుము/తెరువు; క్లోజ్-మూయుము/మూయు;

సేవ్-దాచు; సిగ్నల్-సూచి/సైగ;

గ్రీన్సిగ్నల్-పచ్చసైగ/ఆమోదిని రెడ్సిగ్నల్-ఎర్రసైగ/నిషేధిని;

కేటరింగ్-వడ్డన; సెర్వ్-వడ్డించు/సేవించు;

లింక్ఫెయిల్యూర్-గ్రథనవైఫల్యం/ముడివిడు;

మొబైల్ ఫోన్-సంచారవాణి/చరవాణి/సహవాణి.

ఈ విధంగా కొన్నిచోట్ల యథాతథ అనువాదాలు, కొన్నిచోట్ల భావార్థాలను అనుసరించిన పదబంధాల కూర్పుల ఆధారంగా నూతన రూపాలను నిర్మించవచ్చు. ఎలా నిర్మించినా సులభ బోధ ముఖ్యం. నివిడి కూడా ప్రధానమే. రెండుమూడు వర్ణాలున్న పదానికి తెలుగులో ఇంకా పెద్ద రూపాన్ని చూపితే వాడుకలోకి రాదు. మూల భాషలోని పదాలకన్నా సులభంగా, సంక్షిప్తంగా, అర్థవంతంగా ఉండేలా కూర్చాలి. ప్రయత్నం చేస్తే కష్టంకాదు. ఇప్పటికే సిద్ధంగా వాడుకలో ఉన్నవాటికి కొత్తరూపాలు అనవసరమనే ఉదాసీనత తగదు, అది మన భాషకు నష్టమే. ఇప్పటికే సంస్కృత ప్రభావం వల్ల ఎన్నో తెలుగు పదాలు వ్యవహారానికి దూరం అయ్యాయి. ప్రాచీన కవులు వాడిన ఎన్నో అచ్చతెలుగు పదాలు అర్థం కావడంలేదు. ఉదా: నాచనసోముడు ఉత్తర హరివంశంలో క్రీడలకు సంబంధించి ఎన్నో పదాలను వాడాడు. తెలుగు భాషా పదాలను ఇప్పుడు ఆంగ్ల ప్రభావంవల్ల నష్టపోతున్నాం. ఈ ప్రమాదం నుండి బయటపడాలంటే వివిధరంగాలకు చెందిన పారిభాషిక పదాలకు నిఘంటువులు తెలుగులో విరివిగా రావలసిన అవసరం, ఆ పదాలను ప్రయత్న పూర్వకంగానయినా వ్యాప్తిలోనికి తీసుకురావలసిన అగత్యం ఎంతో ఉంది.

("Technical Terminology in Telugu: 21st Century Challenges and Solutions" అనే అంశంపై జరిగిన జాతీయ సదస్సులో సంయుక్తంగా సమర్పించిన పత్రం. P.S. Telugu University, Hyd 24&25th March, 2008.)

# ఆంధ్రుల చరిత్రలో తొలిదశ

- వకుళాభరణం రామకృష్ణ

తెలుగువారి సమగ్ర చరిత్ర, సంస్కృతుల గూర్చి ఒక సాధికారిక అధ్యయనం ఇంతవరకు జరగలేదు. ఒక శతాబ్దానికి పైబడి ఎన్నో ముఖ్య పరిశోధనలు జరుగుతూవున్నా, ఇవి విడివిడిగా, భిన్న ఘట్టాలపై, దశలపై వెలుగును ప్రసరించాయి. తద్వారా తెలుగువారి చరిత్ర సుసంపన్నమైంది. ముఖ్యంగా స్వాతంత్ర్యానంతర కాలంలో, విశ్వవిద్యాలయాల్లోనూ, వెలుపలా పరిశోధనలు గణనీయంగా జరిగాయి. అయితే, ఈ పరిశోధనలన్నింటినీ ఏర్చి, కూర్చి, ఒకచోట చేర్చి, విశ్లేషణారీతిలో సంపూర్ణ, సమగ్ర చరిత్ర వెలువడలేదన్నది విజ్ఞుల అభిప్రాయం. ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన లగాయతు, 1960 దశకంలో, సమగ్ర చరిత్ర ప్రయత్నాన్ని అంతర్జాతీయ తెలుగు కేంద్రం (International Telugu Institute : ఇప్పుడది తెలుగు విశ్వవిద్యాలయంలోలీనమైంది), అంకురార్పణ చేసింది. కానీ ఎందువల్లనో ఆ పని కొనసాగలేదు. ఆ తర్వాతి కాలంలో కొన్ని విశ్వవిద్యాలయాలు, తెలుగు అకాడెమీ లాంటి సంస్థలు ప్రయత్నాలు ప్రారంభించినా జరిగిన కృషిమాత్రం శూన్యం.

ఆ దశలో, 1998లో ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ (చరిత్రకారుల అధ్యయన సంస్థ) ఈ బృహత్ కార్యాన్ని నెత్తికెత్తుకుంది. చరిత్ర పూర్వయుగం నుండి వర్తమాన చరిత్ర దాకా, మొత్తం చరిత్రను ఎనిమిది సంపుటాల్లో గ్రంథస్తం చేయాలని సంకల్పించి, ఒక సలహామండలిని ప్రధాన, సహాయ సంపాదకులను, సంపుటాలకు ప్రత్యేకంగా సంపాదకులను, ఒక్కో సంపుటంలోని అధ్యాయాలను రాయడానికి లబ్ధ ప్రతిష్టులైన చరిత్రకారులను ఎంపిక చేసుకొని కృషి ఆరంభించింది. మొదటి సంపుటం (చరిత్ర పూర్వయుగం క్రీ.పూ. 500 వరకు) ద్రవిడ విశ్వవిద్యాలయం వారితో కలిసి, ఆంగ్ల, తెలుగు భాషల్లో వెలువరించింది. ఇప్పుడు, రెండవ సంపుటం 'Comprehensive History and Culture of Andhra Pradesh', (క్రీ.పూ. 500-624 క్రీ.శ.) ఆంగ్లంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంతో కలసి ప్రచురించింది. తెలుగు అనుసృజన రెండు నెలల్లో వెలువడనుంది.

రెండవ సంపుటానికి ప్రముఖ పురావస్తు పరిశోధకుడు, డా॥ ఇంగువ కార్తికేయ శర్మ సంపాదకుడు. ఇందులోని 15 అధ్యాయాల్ని చరిత్ర రచనలో విశేష కృషి సల్పిన శ్రీయుతులు పి.వి. పరబ్రహ్మ శాస్త్రి, వి.వి. కృష్ణ శాస్త్రి, సి. సోమసుందర రావు, రాజేంద్ర ప్రసాద్, కామేశ్వర రావు, శివనాగిరెడ్డి, జవహర్లాల్, రామ్‌కుమార్ రత్నంలతో పాటు ఇంకా అనేకులున్నారు. శాతవాహనుల రాజకీయ చరిత్రతో మొదలెట్టి, వేంగీ చాళుక్యులదాకా జరిగిన ఆంధ్రుల చరిత్ర తొలిదశ చారిత్రక విశేషాలు,

ప్రొఫెసర్ వకుళాభరణం రామకృష్ణ, 102, విజయమేనర్స్, మెహిదిపట్నం, హైదరాబాద్-28

కాలక్రమణిక ప్రకారం వివరించడం జరిగింది. రాజకీయ చరిత్రతోపాటు ఈ సంపుటంలో మతం, సాహిత్యం, కళలు, భాష, వాస్తు కళ, ప్రతిమాశాస్త్రం, ఆర్థికాంశాలు వివరంగా చర్చించబడ్డాయి.

ఈ సంపుటంలోని ఆంధ్రుల చరిత్ర ఎంతో ప్రాముఖ్యం గలది. సమాజంలోని అన్ని విభాగాల్లో మౌలిక మార్పులు చోటు చేసుకొన్న దశ. ఆదిమ గణ వ్యవస్థ నుండి చారిత్రక దశకు పౌర సమాజం పరిణామం చెందుతున్న క్రమంలో, సంధిదశలో పాత, కొత్త వ్యవస్థలు ఒక వైపు పరస్పరం సంఘర్షిస్తూనే, మరో కోణంలో, సామరస్యం, సర్దుబాట్లతో, ఇరు వ్యవస్థల్లోని ధనాంశాలను గ్రహింపు చేసుకుంటూ ముందుకు సాగుతున్న కాలం. భిన్న మత భావజలాలు పోటీపడినా, పిడివాదానికి, మత మౌఢ్యానికి తావులేదు. మతం, ఒక సామాజిక వ్యవస్థగా, శాంతియుత సహజీవనానికి ఉపకరించే సాధనంగా పనిచేసింది. రాజ్య సుస్థిరతకు, పటిష్టతకు, సమైక్యతకు మతసామరస్యం అవసరమని అప్పటి రాచరిక వ్యవస్థ భావించడమే గాక ఆచరించింది గూడ. రాజ్యం (state) ప్రత్యేకించి ఒక మతాన్ని ఆమోదించి, దాన్ని తమ అధికార మతంగా పాలకులు ప్రకటించక పోవడం గమనించాలి. విభిన్న జాతులకు ఆలవాలమైన ఆర్యేతర ప్రాంతం (దక్షిణభారతం) లోకి వైదిక, బౌద్ధ, జైన మతాలు ప్రవేశించాయి. అవి కాలక్రమంలో మార్పులకు, ఈ దశలోనే లోనయ్యాయి. వైదిక కర్మకాండల నుండి పౌరాణిక దైవారాధన వైపు, హీనయానం నుండి మహాయానం వైపుగా మార్పు చెందాయి. జైనం గూడా మార్పులకు గురైంది.

వేట, ఆహార సేకరణ, పశుపోషణల ఆధారంగా ప్రాథమిక (Sub Asistant Economy) ఆర్థిక దశ నుండి నాగలి వ్యవసాయాన్ని ప్రవేశించి, భూమిపై హక్కుదారులుగా హాలికులు, గహపతులు పుట్టుకొచ్చారు. వ్యవసాయం వల్ల కొత్త వృత్తులొచ్చాయి. దాంతో, వాటి ఆధారంగా కుల వ్యవస్థ రూపుదిద్దుకో నారంభించింది. వ్యవసాయంలోని మిగులుతో వర్తక, వాణిజ్యాలు వృద్ధి చెందాయి. విదేశాలతో వాణిజ్యం విస్తారంగా పెరిగింది. బౌద్ధమతం వర్తక వాణిజ్య వర్గాలకు ఊతమిచ్చి, విదేశీ వాణిజ్యానికి గూడా దోహద పడ్డం విశేషంగా చెప్పుకోవాలి. రోమన్ నాణేలు కొండాపూర్, పెదబంకూర్, ఏలేశ్వరం, నాగార్జునకొండ, వీరాపురం, తొట్లకొండ త్రవ్వకాల్లో విరివిగా లభ్యం కావడం దీనికి నిదర్శనం. శ్రేష్టులు, సెట్టిలు, వాణిజ్య శ్రేణుల గూర్చి గూడ ఈ సంపుటంలో వివరించబడింది.

ఆంధ్రుల శిల్పకళా ఔన్నత్యం, అమరావతి, నాగార్జునకొండ, గోలి, జగ్గయ్యపేట, భట్టిప్రోలు మొదలగు ప్రదేశాల్లో ప్రస్ఫుటమైందీయుగంలోనే.

ఈ సంపుటంలో సాంస్కృతిక పటం (Cultural Map of Andhra) చేర్చారు. తెలుగు భాషకు సంబంధించిన లిపి పటాలు, Maps, దృశ్యాలతోపాటు, విపులమైన రెఫరెన్సు గ్రంథాల వివరాలు, పారిభాషిక పద సూచిక (Glossory) ఉండి, సంపుటానికి సమగ్రత చేకూర్చాయి.

# విశ్వనాథ - సౌందర్య జిజ్ఞాస

- డా॥ యు.ఎ. నరసింహమూర్తి

సౌందర్య మనునట్టి నాకు తెలిసిన సరుకు, నీ నుండి
యైందవ మృదు కలాహాసన! సరఫరాయైనది స్వామి!
ముందటి జన్మలో నేను నీ వేణు ముగ్ధనాదమ్ము
బిందువై నందమూర్నిలయ! సంతాన వేణుగోపాల! (నందమూరి శతకము, ప:2)

సౌందర్యమంటే భగవంతుడు. సమస్త చరాచర సృష్టికి సౌందర్యాన్ని ప్రసాదించేవాడు భగవంతుడే. ప్రాణికోటి మనస్సులను పరవశింప జేయడం సౌందర్యానికి గల ప్రాథమిక లక్షణం. శ్రీకృష్ణుని వేణు గానంలోని రహస్యమిదే. భగవంతుడైన శ్రీకృష్ణుడు తనలోని సౌందర్యాంశను మురళీ గాన రూపంగా ప్రకటితం చేసి చరాచర ప్రకృతిని సమ్ముగ్ధం చేసాడు. అది సత్యమైన సౌందర్య సృష్టి. ఆ సత్య సౌందర్య ఆస్వాదనతో ప్రేరితుడైన మానవుడు ఆ సుందర గానంలో సంలీనం చెంది ఆ వేణు గాన ప్రవాహంలో ఒక బిందువుగా మారి ఆ చైతన్యం చేత సంక్రమించిన స్ఫురణతో సౌందర్యానికి పునస్సృష్టి చేస్తాడు. ఇది విశ్వనాథ భావన. భారతీయులు భగవంతుడే సౌందర్య నిధానమనే విశ్వాసం గలవారు. సత్యము, శివము, సౌందర్యము అనే త్రిపుటి అవిభాజ్యమైనదని, అదే భగవత్స్వరూపమని భారతీయ తత్త్వశాస్త్రం చెపుతుంది. పాశ్చాత్య తత్త్వవేత్తలలో కూడా ఈ రకమైన విశ్వాసాన్ని ప్రకటించిన వారున్నారు. సత్యమే సౌందర్యము, శివశంకరమైన అభివ్యక్తి సౌందర్యము. అది పరిపూర్ణ దివ్యత్వానికి ప్రతీక. విస్పష్టమైన సాధుత్వ ప్రకటనము సౌందర్యము.[1] అని పలికిన జార్జి శాంతాయన శతాబ్దాల నుండి కొనసాగి వస్తోన్న పాశ్చాత్య తాత్త్విక ధారకు ప్రతినిధిగా కనిపిస్తాడు. పాశ్చాత్యులైన తాత్త్వికులు సౌందర్య సాధనకు, ప్రాగ్జన్మ సంస్కారానికీ గల సంబంధాన్ని గూర్చి ఆలోచన చేయలేదు. సౌందర్య భావనకు ప్రాగ్జన్మ సంస్కారం మూలమనే భారతీయ తాత్త్వికధార విశ్వనాథ చెప్పిన పై పద్యంలో ప్రతిఫలించింది.

సౌందర్య జ్ఞానం అంటే ఏమిటి? అనే ప్రశ్నకు విశ్వనాథ "ఏ బుద్ధి చేతనైతే ఒక దానిలోని ఒకానొక వైశిష్ట్యం మనకు పరమప్రియంగా అనిపిస్తుందో అది సౌందర్యం. దేనిచేత వాడు తృప్తి పడుతున్నాడో, దేనిని చూసి లౌకికేతరమైన తృప్తిని పొందుతున్నాడో ఆ లక్షణం మనసు లోపల ఉన్నది. దానికి సహజమైన లక్షణం అది. Next Best లక్షణం, జీవుడి లక్షణం. అదీ సౌందర్యమంటే!" అన్నారు. మనసు ఒక తేనెపట్టు అని, తేనెపట్టులో తేనె మాత్రమే కాక ఇతర సామగ్రి కూడా ఉన్నట్లే మనసులో ఒకచోట సౌందర్య జ్ఞానం, ఒకచోట సాహిత్యం, ఒకచోట పరమేశ్వర భావం, ఒకచోట విచారణ, ఒకచోట లౌకిక ప్రవృత్తి ఉంటాయని, సౌందర్య జిజ్ఞాస అనేది ఒకానొక మనో లక్షణమని విశ్వనాథ పేర్కొన్నారు. సౌందర్య జ్ఞానం దేశకాల పాత్రాదుల ననుసరించి భిన్న భిన్నంగా ఉంటుందని దానికొక నిశ్చిత ప్రమాణం లేదని "ఇది అందంగా ఉంది అనుకోవటమే సౌందర్యం" అని వారు వివరించారు.[2] "మనం సౌందర్యాన్ని గూర్చి అనేక చర్చలు చేస్తాం. అలాగని సౌందర్యాన్ని గూర్చి ఇదమిత్థమని తేల్చే ప్రమాణాలు లేవు" అనే కౌంట్ అభిప్రాయంతో విశ్వనాథ అభిప్రాయం సంవదిస్తోంది.

---

డా॥ యు.ఎ. నరసింహమూర్తి, 8-30-7, సాయినగర్, తోటపాలెం, విజయనగరం - 535003.

సౌందర్య జ్ఞానం రెండు రకాలు. భగవత్సృష్టియైన భౌతిక సౌందర్యం ఒకటి. మానవుడు పంచేంద్రియ జ్ఞానంతో ఈ సౌందర్యాన్ని దర్శించి అనుభవిస్తాడు. ఇది పంచభూతాత్మకమైనది. భగవత్సాన్నిధ్యాన్ని చేరుకోడానికి చేసే ప్రయత్నంలో సిద్ధించే ఆధ్యాత్మిక సౌందర్యం ఇంకొకటి. దీనిని సాధించడానికి, దర్శించడానికి ఆత్మ మూలము.

ఈ రెండింటినీ సమన్వయిస్తూ సర్వాతిశాయి అయిన సౌందర్య సృష్టి చేసేది కళ. అనశ్వరము, అలౌకికము అయిన ఈ కళాసృష్టికి మూలం మనస్సు. అది సాహిత్య కళ కావచ్చు, సంగీత కళ కావచ్చు, ఇతరమైన కళ కావచ్చు. సాహిత్య కళాసృష్టి ఉత్తమ స్థాయిలో కొనసాగించే కవి మనస్సులో ఒకచోట సౌందర్య జ్ఞానం, ఒకచోట సాహిత్యం, ఒకచోట పరమేశ్వర భావం, ఒకచోట విచారణ, ఒకచోట లౌకిక ప్రవృత్తి ఉంటాయి. వాటి మధ్య అవిభాజ్యము సమగ్రము సమీచీనము అయిన ఐక్యం కుదిరినప్పుడే సుందరమైన సాహిత్య కళాసృష్టి జరుగుతుందని విశ్వనాథ భావించారు. అది అతని సాహిత్య సౌందర్య దర్శనానికి ప్రథమ సోపానం.

సాహిత్య సౌందర్య సృష్టిలో కవి, భావుకుడు అనే వారిద్దరూ భాగస్వాములు. కవి భావనా వ్యాపారాన్ని భావుకుడు కూడా తదనుగుణమైన రీతిలో భావించగలగాలి. అప్పుడే కవి సృష్టించిన సౌందర్య స్వరూపం భావుకునికి అవగాహన అవుతుంది. కవి తనకు తానుగా సౌందర్యమంటే ఇది అనిగానీ ఇక్కడ సౌందర్య ముంటుంది అనిగానీ చెప్పడు. సౌందర్యమొక మహావిషయం. పరమేశ్వరుడు సౌందర్యానుభవాన్ని పొందగలరు. అంతేగానీ తన అనుభవాన్ని గూర్చి విడమరచి అందరికీ చెప్పలేరు. దానినలా చెప్పడం సాధ్యం కాదు. ఒకవేళ ఆ విధంగా వివరించి చెప్పినా అందులో సౌందర్యం నిలువదు. కొన్నింటి సౌందర్యం చెప్పే కొలదీ అగమ్య గోచరమవుతుంది. కొందరు కుహనా సౌందర్యవాదులు సౌందర్యం లేనిచోట కూడా ఉన్నట్లుగా చూపించడానికి ప్రయత్నం చేస్తారు. అటువంటి సందర్భంలో అక్కడ ఉండే కొద్దిపాటి సౌందర్యం కూడా అంతరించిపోతుంది. భౌతిక, ఆధ్యాత్మిక సౌందర్యాల పునస్సృష్టి అయిన సృజన వ్యాపారం కావ్యసౌందర్యంగా అవతరిస్తుంది. కావ్యసౌందర్యంలో విభిన్న పక్షాలున్నాయి. అందులో రచనా పక్షమొకటి. భావుకుడు కవి రచన లోని సౌందర్యాస్వాదం చేయాలంటే శిల్పము, భావసంగ్రహణం చేయుటలోని నేర్పు, ప్రాస, యతి, గణముల విరుపు మొదలైన చోట్ల కవి చేసిన చమత్కారాలను గ్రహించగలగాలి. తాను గ్రహించిన అంశాలను శోభాతిశయమైన మార్గంలో ఇతరులకు వివరించి చెప్పగలగాలి. అప్పుడు కవి సృష్టిలోని సౌందర్యం అందరూ గుర్తించగలుగుతారు. కావ్య సౌందర్యాస్వాద మార్గాన్ని విశ్వనాథ ఈ విధంగా వివరించారు.[3]

ఉత్కృష్ట సౌందర్యం భౌతిక ప్రమాణాలలో సమగ్రంగా ఇముడదు. కావ్యంలో ఉండే స్త్రీ పురుషాదుల వర్ణనలు, ప్రకృతి వర్ణనలు, మానసికావస్థల నిరూపణము, వివిధ అవస్థా భేదాల కల్పన - ఇవన్నీ భౌతికమైనవే. వాటికి నిర్దిష్టమైన ప్రమాణాలుంటాయి. లౌకికవాసన లేని కావ్యముండదు. అటువంటి కావ్య గ్రథనంలో కవి తన దర్శనంలోని అలౌకిక సౌందర్యాన్ని స్వయం వ్యక్తమయేలా నిబంధించాలి. అలౌకిక సౌందర్యం ఊహలలో పొటమరిస్తుంది. అంత వరకు భావుకుడుగానీ, సాధారణ పాఠకుడు గానీ ఎరుగని ఒకానొక నవ్యతాస్ఫూర్తి ఆ అలౌకిక సౌందర్య స్ఫూర్తికి జీవంగా నిలుస్తుంది. అటువంటి ఊహ్యమానమైన సౌందర్యాన్ని భౌతిక ప్రమాణాలలో అంతర్లీనంగా సంలగ్నం చేయలేని అసంతృప్తి కవిని ఎప్పటికప్పుడు బాధిస్తూనే ఉంటుంది. ఈ అసంతృప్తిని ఎరిగిన విశ్వనాథ ఇందుకు వ్యతిరిక్త

దిశలో కూడా యోచన చేసి సౌందర్య తత్త్వాన్వేషణ కొనసాగించారు. కొన్ని సందర్భాలలో భౌతిక ప్రమాణాలలో మనకు దర్శనమిచ్చే సౌందర్యం ప్రజ్ఞా విలసనంతో కూడిన కవి సృష్టిలోని ఊహ్యమానమైన సౌందర్యాన్ని అతిక్రమించి మనలను విభ్రాంతులను చేయడం కూడా ఉంటుందని ఆయన అంటారు.

కరచరణాద్యవయవ వి
స్ఫురణం బీదృశముగాఁ గఁ బొల్చునె ధాత్రిన్
పురుషాకృతి యీ దృశ సుం
దర భావంచింత దవ్వు దాల్చునే ధాత్రిన్
ఊహలోనున్న సౌందర్య మొదిగి మాను
షంబు నీరూపమగుట యాశ్చర్యకరము
ఊహలో నింత సౌందర్య మొదుగు నొక్కొ
యిది వివర్త పథంబున నెసగవలయు (సుందర : సంధ్యా : 301, 302)

పురుషులు స్త్రీల కంటే అందంగా ఉంటారని, సర్వపురుష సమ్మోహకమైన ఆ స్త్రీ సౌందర్యాన్ని అతిక్రమించిన పురుష సౌందర్యం అబ్బురపాటు కలిగిస్తోందని, కాలూ-చేయి మొదలైన శరీరావయవాల పొందికలో ఊహ్యమాన సౌందర్యాన్ని అతిశయించిన సౌందర్యం కనిపిస్తోందని ఇక్కడ మొదటి పద్యం చెపుతోంది. ఇది సర్వసామాన్యమైన కల్పనే. కానీ ఈ విధమైన భౌతిక సౌందర్యం ఊహలో సైతం ఇముడ్చుకోవడం సాధ్యం కాదని చెప్పడం విశ్వనాథ సౌందర్య దర్శనంలోని ప్రత్యేకత.

తన సౌందర్య సృష్టిని గూర్చి కవి ఇటువంటి తర్కవితర్కాలకు లోనౌతూ దాని అతిశయ లక్షణాన్ని సహృదయులు గ్రహించేలా చేస్తాడు. కవి ఈ విధంగా వ్యాఖ్యానించే సందర్భాలు చాలా అరుదుగా ఉంటాయి. కానీ ప్రతిపర్వ రసోదయంగా చవులందించే సమర్థుడైన కవి రచనలో అడుగడుగునా సౌందర్యం చిప్పిలుతూ ఉంటుంది. దానిని కొందరు గ్రహించగలరు. కొందరు గ్రహించలేరు. ఆ గ్రహించలేని సందర్భాలను గ్రహించుకొని భావుకుడు దానిని విశదం చేస్తే కవిత్వ ప్రయోజనం పరిపూర్ణమౌతుంది.

మందలౌచు శ్రవస్సమాజ మంథరములై
        దిగ దిగ దూఁకు కుందేళ్ళ వోలె
నమ్రంబులై శిఖానాళ క్రమంబులై
        మఱి పర్వులెత్తు నెమళ్ళ వోలె
శతములై రిపు జిగీషా శృంగ శితములై
        నలిరేగు నడవి దున్నల విధాన
నా మహాగర్తంబు నందు వార్ధిజవాలు
        పడఁబోసి కొనియె శుంభజ్ఝరాలు
పేర్చి నిమ్నోన్నతములైన వృష్ఠకుంభ
ములను బరువెత్తుచున్న యేన్గుల విధాన
జాలు విదలించు కొనుచు భాసురములై య
మోఘముగ దూఁకు పంచాస్యములు విధాన (సుందర, సంధ్యా 16, పుట : 346)

ఇది ప్రౌఢ సౌందర్య కల్పన. సామాన్యులకు ఈ దర్శనం సాధ్యం కాదు. ఇంతటి ఉదాత్త దార్శనిక శక్తిగల కవి సౌందర్య కల్పనను విశదం చేయగల భావకుడు సైతం భావుకతా వైభవంలో కవికి అత్యంత సన్నిహితుడు కావాలి. అప్పుడు అతడు కూడా ఆ మహాసౌందర్య దర్శనం చేసి తన అనుభూతిని అందరికీ విశదం చేయగలడు. వడలి మందేశ్వరరావు ఈ పద్యంలోని సొగసును విశదం చేస్తూ విశ్వనాథ కవిత్వంలో పుంభావ లక్షణ ముంటుందని అన్నారు. విశ్వనాథ వాడే శబ్దాలు, శబ్ద చిత్రాలు, అలంకార సామగ్రి, వర్ణనలు ఆయన వ్యక్తిత్వంలోని ఈ పుంభావ లక్షణానికి ప్రతీకలుగా నిలుస్తాయని అన్నారు. హృదయాన్నే కాక నేరుగా మేధను ఆకర్షించే ఈ విధమైన శిల్పసౌందర్య నిర్వహణ విశ్వనాథకు తిక్కన, శ్రీకృష్ణ దేవరాయలు, తెనాలి రామకృష్ణుల కవిత్వం నుండి సంక్రమించిన ప్రౌఢ పుంభావ లక్షణంగా వారు అభివర్ణించారు.[4] భావుకుడు కాని వ్యాఖ్యాత శబ్దం, అర్థం, తాత్పర్యం వంటి సౌందర్య సారాన్ని అందించలేని అనవసర సామగ్రి వెంట వెంపర్లాడి కవి మనసును చిన్నాభిన్నం చేస్తాడు. భావుకుడైనవాడు కవి హృదయంలోని సౌందర్య రహస్యాన్ని ఆకళించుకొని దానికి సంబంధించిన కళాపక్షాన్ని ఆవిష్కరిస్తాడు. ఇది కవి-భావుకుల మధ్య ఉండే సౌందర్య సంబంధం. ఈ సంబంధాన్నే రమణీయ శబ్ద విచార సందర్భంలో విశ్వనాథ చక్కగా వివరించారు.

రమణీయ శబ్దము సౌందర్య పర్యాయ వాచకం. సౌందర్య పర్యాయ వాచకాలెన్ని ఉన్నా నన్నయ నుండి జగన్నాథ పండితుని వరకు తెలుగువారి సౌందర్య దర్శనం ఒక రమణీయ ముద్రతో భాసించింది. ఆ సంగతిని ప్రస్తావిస్తూ "రమణీయత యనగా రమించుటకు యోగ్యమైనదని యర్థము. రమించుట యనగా దానిని గుఱించి భావించి యొక సుఖముననుభవించుట యనవచ్చును. రమించుట నిమేష మాత్రానుభూతి కాదు. వానియందు కొంత కాలమిమిడి యున్నది. అందుచేత కావ్యార్థములను భావించుట, మననము చేయుట, శిల్పమును గ్రహించుట, ఆస్వాదించుట, చొక్కుట మొదలయినవి దీని యందున్నవి.[5] అని విశ్వనాథ వివరించారు. కవిత్వ రామణీయకతను ఆస్వాదించే యోగ్యత భావకుడికే ఉంటుందని విశ్వనాథ ఈ విధంగా స్పష్టం చేసారు. తెలుగు కావ్య సౌందర్యం యతి, ప్రాస వంటి అంశాలలో కూడా ఇమిడి ఉంటుందని ఆ ప్రయోగ సామరస్యాన్ని అందులోని సౌందర్య రహస్యాన్ని మనసుతో చూసి తెలుసుకోవాలే గానీ నాలుక చివరతో పలికినంత మాత్రంలో గ్రహించడం సాధ్యం కాదని ఆయన అనేక సందర్భాలలో వివరించారు. శిల్ప సంఘటనంలోను, పద్యాల కూర్పులోను, ఒడుపుగా భావాన్ని గ్రహించడంలో యతి, ప్రాస, గణాలను అవస్థానుగుణంగా విరవడంలోను కవి కొన్ని అందచందాలను ప్రదర్శిస్తాడు. వాటిని విడమరచి చెప్పినప్పుడు అక్కడున్న సౌందర్యం అతిశయిస్తుంది. విశిష్టమైన అభిరుచి, దార్శనిక శక్తి కలవారు మాత్రమే సౌందర్యాన్ని గుర్తించగలరు. అటువంటి వారిని భావుకులంటారు. పద్యం రాయడంలో ఉండే నేర్పు వలన అధికానందం కలుగుతుంది. రచించడం అంటే అక్షర సన్నివేశ చారుత్వము, మాటల కూర్పులో నేర్పు. క్లిష్టమైన సంస్కృత సమాసాలను, రమ్యమైన తెలుగు సమాసాలను కలిపి గుచ్చెత్తడంలో ఒక రచనా సౌందర్యము, విలక్షణశైలీ మాధుర్యము ఉన్నాయి. తన రచనలో ఇటువంటి సౌందర్యాన్ని సాధించడానికి విశ్వనాథ రాయలు, రామకృష్ణులను గురువులుగా ఎంచుకొన్నారు. శ్రావ్యతా, శైలీమాధుర్యం అనే గుణాల పట్ల ఆసక్తి పెరిగిన కారణంగా నన్నయ కాలం నుండి ప్రబంధ కాలానికి వచ్చేసరికి పద్య రచనా సౌందర్యంలో అభిరుచి మారుతూ వచ్చింది. ఈ అంశాన్నే "పద్యము శోభగా వ్రాయుట తరువాత తరువాత తెలుగు కవిత్వమునకు ప్రధాన లక్షణమై పోయెను.[6] అని విశ్వనాథ అన్నారు. ఇది విశ్వనాథ మెచ్చిన సౌందర్య మార్గం కాదు.

సౌందర్య రహస్యాల నెన్నింటినో కాచి వడబోసిన విశ్వనాథ భగవంతుణ్ణి "అనితర లభ్య సౌందర్య!" అని సంభోదిస్తారు. భగవత్సౌందర్యం ఇంద్రియ గ్రామముతో కూడినది కాదు. దానికి అతీతమైనది. భగవత్సౌందర్యంతోను, భగవత్సృష్టిలోని సహజ సౌందర్యంతోను పోల్చి చూచినప్పుడు మానవ సౌందర్యం దయనీయమైనదిగా కనిపిస్తుంది. మానవుని శరీరం ఇంద్రియ వాంఛలను, ఇంద్రియ సౌఖ్యాన్నీ వదులుకోలేక పోవడమే ఆ దయనీయతకు కారణం. ఇంద్రియ గ్రామాన్ని ఛేదించుకొని కవిత్వయోగ సమాధి నిష్ఠుడైన కవి అనితర సాధ్యమైన సౌందర్యంతో కూడిన భగవంతుణ్ణి ధ్యానించి సౌందర్య స్పర్శను సాధిస్తాడు.[7] ఆ సాధన అందరినీ సిద్ధించేది కాదు.

ఏ వానికో భవత్పాద జలజ సాహిత్య రమ్యంబు
భావంబు, పాపము! దేహమింద్రియ ప్రణయమైయుండు
ఈవు కృపాదృష్టిఁ జూడకున్నచోఁ శ్వభ్రంబు వాని
కావల నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి! (కులస్వామి శతకము : పద్యం : 67)

జ్ఞానేంద్రియ వ్యాపారాలు సౌందర్యాన్ని గ్రహిస్తాయి. కానీ ఆ గ్రహణకు అందేది భౌతిక సౌందర్యమే. దానికతీతమైన అలౌకికము, ఆధ్యాత్మికము అయిన సౌందర్య దర్శనం చేయాలంటే పరమేశ్వర కృప ప్రధానమని విశ్వనాథ పై పద్యంలో ప్రకటించారు. ఇది కేవలం భారతీయ సౌందర్య తత్త్వ బోధకమే కాక రస్కిన్ వంటి పాశ్చాత్య సౌందర్య తత్త్వాన్వేషకుల అభిప్రాయంతో కూడా సంవదించేదిగా కనిపిస్తుంది. సౌందర్య ప్రాధాన్యాన్నే రస్కిన్ నొక్కి చెప్పాడు. "దీనికి కారణం దృశ్య ప్రపంచంలో ప్రతిబింబించే పరమేశ్వర తత్త్వమే సౌందర్యమని అతడు భావించాడు. భౌతిక సౌందర్యం మనకు దృగ్గోచరమయ్యేది మాత్రమే. కానీ దివ్యజ్యోతి వెలిగించిన సౌందర్యజ్వాల ఎన్నడూ ఆరిపోదు, నశించదు. అది తనలో తాను లీనమౌతుందే గానీ అంతరించిపోదు. అంటూ ఎడ్మండ్ స్పెన్సర్ మహాశయుని అభిప్రాయాన్ని ప్రస్తావించాడు."[8] సర్వజన సామాన్యమైన అనుభూతికి కారణం మానవులందరిలో దివ్యాంశ ఉండడమే. ఆ వస్తువులోని సౌందర్యం భగవంతునిచే నిక్షిప్తమైనదే. మానసిక ప్రమాణాలపై ఆధారపడ్డ సౌందర్యాస్వాదన భిన్నభిన్న ప్రమాణాలలో ఉంటుంది. అని భావించి రస్కిన్ ఆధిభౌతిక మార్గాన్ని అనుసరించాడు. నిరంతర పరిణామ శీలమైన ఆచారం శాశ్వతమూ, నిర్దిష్ట లక్ష్య పూర్వకమూ అయిన సౌందర్యాన్ని శాసింపజాలదని రస్కిన్ భావించాడు. సౌందర్యం వల్ల సంతోషం, ఆరాధన, ప్రీతి జనిస్తాయని చెప్తూనే సౌందర్యం వల్ల కలిగే ప్రీతికీ, పరిచయం వల్ల కలిగే ప్రీతికీ భేదాన్ని పాటించాడు. సౌందర్యాన్ని పరిచయాలతో ముడిపెట్టడం వల్ల దాని దివ్యస్థాయి తొలగిపోయి మానవీయమౌతుందనే కారణంగా పరిచయవాదాన్ని రస్కిన్ తిరస్కరించాడు. ఆత్మాశ్రయ లక్షణం లేని సౌందర్య భావనని రస్కిన్ గుర్తించాడు. (1) సత్యమే సౌందర్యం (2) ఔపయోగికతే సౌందర్యం (3) సంప్రదాయ బద్ధతే సౌందర్యం (4) భావానుబంధ నిబద్ధమైనదే సౌందర్యం అనే తనకు పూర్వం ఉండే నాలుగు సౌందర్య భావనలనూ వ్యతిరేకిస్తూ తనదైన సౌందర్య భావనని ప్రతిపాదించాడు. అందులో మొదటిది విలక్షణ సౌందర్యం. అంటే వస్తు జగత్తులో దివ్యాంశలను ప్రతీకాత్మకంగా దర్శించడమే. రస్కిన్ సౌందర్యాన్ని జీవసౌందర్యం (Physical Beauty) విలక్షణ సౌందర్యం (Typical Beauty) అని రెండు రకాలుగా విభజించాడు. దివ్య స్వభావాన్ని రూపుదాల్చి సౌందర్యానుభూతిని కలిగిస్తున్న కారణంగా కళారూపాలూ, వాటి లక్షణాలూ ప్రదర్శించే సౌందర్యం విలక్షణ సౌందర్యం కాగలదు. జీవసౌందర్యం ప్రాణికోటి సౌందర్యమే. దివ్య సౌందర్యం సహజాతం వల్ల సద్యస్స్ఫురితమౌతుంది. జీవ సౌందర్యం ఆంతరిక చలనాల కారణంగా వృద్ధి చెందే ఆసక్తి కారణంగా అనుభూతమౌతుంది.

(మిగతాది వచ్చే సంచికలో)



పింగాణి కలశం (18వ శతాబ్ది)

ఉల్బణ (Relief) కృతి (జర్మనీ)



కేగన్ జలపాతం జపాన్, (19వ శతాబ్ది)



పింగాణి కలశం, ఫ్రాన్స్ (19వ శతాబ్ది)

MISIMI / **మిసిమి** / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD-191/2006-08



మెఫిస్టోఫిలీ - మార్గరెటా, కొయ్యశిల్పం (అజ్ఞాతశిల్పి) ఫ్రాన్స్ (19వ శతాబ్ది)